# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 43 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 04 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 43 04-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




రెడ్ బుక్ పేరు వినగానే.. ఒకరికి గుండెపోటు..

6 లో..

### అమరావతి నిర్మాణంలో కీలక పరిణామం..

# సింగపూర్ సడన్ ఎంట్రీ!





**అమరావతి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతి రాజధాని పున ప్రారంభానికి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. ఈ నెలలోనే అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతులు మీదుగా శ్రీకారం చుట్ట నున్నారు. ఈరోజు మంత్రివర్గ భేటీలో ఇందుకు సంబంధించి ఒక నిర్ణయం తీసుకోనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం కూడా సహాయపడుతోంది. 15 వేల కోట్ల రూపాయల సాయాన్ని బడ్జెట్లో ప్రకటించింది. ప్రపంచ బ్యాంకుతోపాటు ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఈ నిధులు సర్దుబాటు చేయనుంది. అందులో మొదటి విడత సాయంగా 3000 కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. ఇంకోవైపు వివిధ మార్గాల్లో నిధుల సమీకరణ చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. దాదాపు 30 వేల కోట్ల రూపాయలు సిద్ధం చేసి శరవేగంగా అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి

- తరువాయి 2లో..

# ముగిసిన ఎపి కేబినెట్

### కీలక అంశాలపై ఆమోదం

**అమరావతి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎపి మంత్రివర్గ సమావేశం ముగిసింది. గురువారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించిన ఎపి కేబినెట్ ఆమోదం

2 లో..





## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి ఎమ్మెల్సీ నాగబాబు

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసి ఎమ్మెల్సీ నాగబాబు**

- ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన నాగబాబుకి శుభాకాంక్షలు తెలిపిన పవన్




**అమరావతి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఈ రోజు (ఏప్రిల్ 3న) జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, బుధవారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆత్మీయ అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# టీటీడీలో భారీ సంస్కరణలు!

## టీటీడీలో సంస్కరణలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం
- రాబోవు 50 సంవత్సరాలకు అనుగుణంగా భక్తులకు కల్పించే సౌకర్యాలపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం



**అమరావతి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి తిరుమల పవిత్రత, ప్రాశస్త్యం, పరిరక్షణ ప్రాధాన్యత ఇస్తూ వస్తుంది.. తిరుమలలో సంస్కరణలు 1983 నుంచి వేగవంతమైంది చెప్పవచ్చు. ఎన్టీఆర్ సీఎం అయిన తరువాత తిరుమలలో అనేక మార్పులు చేర్పులు చేసారు. భక్తులకు సౌకర్య కల్పనలో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. తిరుమలలో అనేక సంస్కరణలు బీజం ఎన్టీఆర్ వేస్తే గాని కొనసాగింపు చంద్రబాబు చేస్తున్నారు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిర్మాణం, అన్నప్రసాద ట్రస్ట్ ప్రారంభం వంటివి అన్న ఎన్టీఆర్ హయంలో ప్రారంభమైనవే. స్విమ్స్ హాస్పిటల్, బర్డ్ హాస్పిటల్ వంటివి అన్న ఎన్టీఆర్ మానస పుత్రికలు. శేషాచలం కొండలలో పచ్చదనం పెంపు కార్యక్రమం ప్రారంభించింది కూడా ఎన్టీఆర్యే.. శేషాచలం కొండలపై హెలికాప్టర్ ద్వారా విత్తనాలు చల్లి సప్తగిరులను పచ్చగా మార్చారు. మరో వైపు తిరుమలలో మహాద్వార నిభందనలు అమలులోకి తీసుకువచ్చింది. ఆలయంలో మీరాశి వ్యవస్థ రద్దు చేసింది.. శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయం ప్రారంభమైంది కూడా ఎన్టీఆర్ హయాంలోనే.. ఇలా తిరుమల అభివృద్ధి పై ఎన్టీఆర్ హయంలో ఒక మార్క్ ఏర్పడింది. అటు తరువాత చంద్రబాబు కూడా ఇదే మార్క్ ని కొనసాగిస్తూ వచ్చారు. తిరుమల అభివృద్ధి పై చంద్రబాబు మొదటి నుంచి పట్టుదలగా

- తరువాయి 2లో..



## రుషికొండ ప్యాలెస్‌పై చంద్రబాబు ఫోకస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలోని రుషికొండ భవనాల భవితవ్యంపై కీలకంగా ఆలోచిస్తోంది. వందల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలను ఎలా వినియోగించుకోవాలనే దానిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు మంత్రులతో సమీక్ష నిర్వహించారు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించగా, రుషికొండ భవనాల గురించి ప్రత్యేకంగా చర్చించారని సమాచారం. సీఎం చంద్రబాబు మంత్రులు మొదట రుషికొండ ప్యాలెస్‌ను సందర్శించాలని, అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై అభిప్రాయాలు ఇవ్వాలని సూచించారు. రుషికొండ ప్యాలెస్ 9.88 ఎకరాల

- మిగతా 2లో..



## వేరువేరు ప్రాంతాల్లో పిడుగులు..

ముగ్గురు ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు !

వార్త 2లో..

### ఇచ్చిన మాట ప్రకారమే..

# పేదలకు ‘పట్టా’భిషేకం

- పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
- గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
- ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
- మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ

**ఉండవల్లి, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని

2 లో



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## ఎంత 'నిర్మల'మైన న్యాయం?!

**ఇంట్లో గోనె సంచుల్లో నోట్ల కట్టలు తగులబడిన జస్టిస్ యశ్వంత్ వర్మ కథ ఇంకా మరిచిపోక ముందే, దాని అడుగుజాడల్లోనే, థ్రిల్లర్ సినిమాను మైమరపింపజేసే మరొక న్యాయమూర్తి రసవత్తరమైన కథ గురించి చెప్పుకోవ లసి వస్తున్నది. 'తీగలాగితే డొంక కదిలింది' అనే సామెతను అక్షరాలా నిజం చేసే వాస్తవ కథనం ఇది.**

సినిమా కథలు తిరిగినన్ని మలుపులు, అనూహ్య సంఘ టనలు, తారుమారు పరిణామాలు ఎన్నో ఉన్న ఈ అవినీతి కథ ఒక తారుమారు తమాషాతో మొదలయింది. పంజాబ్%-% హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ 2008 జూలై 10న పదవి స్వీకరించారు. తర్వాత నెల రోజు లకు, 2008 ఆగస్ట్ 13న ఆమె ఇంటికి ఒక వ్యక్తి వచ్చి 'నిర్మల్ జీకి ఇమ్మని ఢిల్లీ నుంచి ఈ పార్సెల్ వచ్చింది' అని ఒక ప్లాస్టిక్ కవర్ ఇచ్చాడు. అమ్రిక్ సింగ్ అనే వాచ్‌మన్ ఆ పార్సెల్ లోపలికి తీసుకొచ్చి న్యాయమూర్తి ముందు విప్పితే, అందులో నుంచి అక్షరాలా పదిహేను లక్షల రూపాయలు బైటపడ్డాయి. ఆ పార్సెల్ తెచ్చిన ప్రకాష్ అనే వ్యక్తిని పోలీసులకు అప్పగించి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విషయం తెలియజేశారు.

పోలీసులు ప్రకాష్‌ను ప్రశ్నించగా, అతను పంజాబ్ హైకోర్టులో అడ్వకేట్ జనరల్‌గా ఉన్న సంజీవ్ బన్సాల్ దగ్గర గుమాస్తా అని తేలింది. పోలీసులు బన్సాల్‌ను ప్రశ్నించగా, అవి తన డబ్బులు కావని, ఢిల్లీకి చెందిన హోటల్ యజమాని రవీందర్ సింగ్ తనకు పంపి, జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు అంద జేయమని చెప్పాడని, తన గుమాస్తాకు 'జస్టిస్ నిర్మల్ జీకి ఇవ్వు' అని పంపిస్తే, పొరపాటున జస్టిస్ నిర్మల్‌జిత్ జీకి ఇచ్చా డని చెప్పాడు. అంటే ఆ సొమ్ము వాస్తవంగా చేరవలసింది జస్టిస్ నిర్మల్ యాదవ్ అనే మరొక న్యాయమూర్తికన్నమాట. గుమాస్తా చేసిన చిన్న పొరపాటువల్ల, ఇద్దరు న్యాయమూర్తుల పేర్లలో నిర్మల్ ఉండడం వల్ల ఈ అవినీతి బయటపడింది.

జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇచ్చిన ఫిర్యాదుతో, రెడ్ హ్యాండెడ్‌గా పదిహేను లక్షల రూపాయలు, అది పట్టుకొచ్చి ఇచ్చిన వారు, పంపించినవారు దొరికారు గనుక పోలీసు కేసు నమోదయింది. కాని, న్యాయమూర్తి, అడ్వకేట్ జనరల్‌లకు ఇందులో భాగం ఉంది గనుక పది రోజుల్లో ఈ కేసును పోలీ సుల నుంచి సీబీఐకి బదిలీ చేశారు. తర్వాత సీబీఐ చేసిన దర్యాప్తులో సంజీవ్ బన్సాల్, రాజీవ్ గుప్తా కలిసి హరియాణా లోని పంచ్ కులాలో కొన్న ఒక భూమి కేసులో, జస్టిస్ నిర్మల్ యాదవ్ వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, అందుకు ప్రతిఫలంగా ఈ లంచం పంపించారని తేలింది. అది మాత్రమే కాక, జస్టిస్ నిర్మల్ యాదవ్ విదేశీ ప్రయాణపు టికెట్లు, విదే శాలలో ఆమె వాడిన మొబైల్ ఫోన్ కార్డ్ కూడా సంజీవ్ బన్సాల్ కొనిపెట్టాడని సీబీఐ సాక్ష్యాధారాలు సేకరించింది. నిందితులకు, న్యాయమూర్తికి మధ్య జరిగిన సంభాషణల ఫోన్ రికార్డులను కూడా సీబీఐ సేకరించింది. చివరికి అవినీతి నిరోధక చట్టం కింద, భారత శిక్షా స్మృతి కింద జస్టిస్ నిర్మల్ యాదవ్ మీద, మిగిలిన నిందితుల మీద కేసు పెట్టవచ్చునని సీబీఐ నిర్ధారించింది. ఇక్కడిదాకా సాఫీగా సాగిన కథ తర్వాత ఎన్నో ఉత్కంఠ భరితమైన మలుపులు తిరిగింది. న్యాయమూర్తి మీద ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇమ్మని కోరుతూ సీబీఐ స్థానిక అధికా రులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఆ నివేదికకు జవాబిస్తూ సీబీఐ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ నిందితుల మీద కేసు నడపడానికి తగిన ఆధారాలు లేవని అన్నారు.

కాని ఆ సమయంలో సీబీఐకి డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తి ఇది తప్పకుండా ప్రాసిక్యూట్ చేయవలసిన అవినీతి నేరమే అన్నారు. సీబీఐ ఉన్నతాధికారులిద్దరు ఇలా భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, మూడో అభిప్రాయం కోసం అప్పటి అటార్నీ జనర ల్‌కు పంపారు. అదే ప్రతిని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్‌కు కూడా పంపారు. అటార్నీ జనరల్ కూడా ఈ కేసులో పస లేదు అన్నారు.

ఈ వ్యవహారం బయటకు పొక్కి, 'హైకోర్టు న్యాయమూర్తి మీద కేసు నడపడానికి తిరస్కరించిన సీబీఐ' అని హిందుస్థాన్ టైమ్స్ 2009 జూన్ 6న ఒక వార్త రాసింది. అది చూసిన అప్పటి న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ, ఇంత తీవ్రమైన వ్యవహారంలో కేసు నడపకపోవడం తప్పు అనీ, అలా చేస్తే న్యాయ వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందనీ తీవ్ర పదజాలంతో న్యాయశాఖ కార్యదర్శికి నోట్ పెట్టి, దర్యాప్తు చేసి నివేదిక ఇమ్మన్నారు.

అప్పుడు సీబీఐ మళ్లీ కొత్తగా వచ్చిన అటార్నీ జనరల్ సలహా కోసం వెళ్లింది. కొత్త అటార్నీ జనరల్ కూడా కేసు అవసరం లేదు అంటూ పాత అటార్నీ జనరల్ అభిప్రాయాన్నే ప్రకటించారు.

దానితో తర్వాత సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో కేసును ఉపసంహరించుకుంటున్నానని (క్లోజర్ రిపోర్ట్) సీబీఐ తెలిపింది. ఇక్కడ కథ మరొక మలుపు తిరిగి, సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, కేసు నడపవల సిందే అన్నారు. అప్పుడు సీబీఐ మరొకసారి అనుమతి కోసం దరఖాస్తు... పైకి పంపించింది.

దాన్ని పరిశీలించిన న్యాయ శాఖ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించగా, రాష్ట్రపతి 2011 మార్చ్‌లో అనుమతి ఇచ్చారు. అంటే రెడ్ హ్యాండెడ్‌గా అవినీతి పట్టు బడినా కేసు ప్రారంభించడానికే మూడు సంవత్సరాలు పట్టిందన్న మాట.

అప్పుడు సీబీఐ చార్జిషీట్ వేసింది. అప్పటికే ఈ కేసు నడపడానికి వీలులేదని ఎన్నో పిటిషన్లు దాఖలు చేసిన జస్టిస్ నిర్మల్ యాదవ్ ఇప్పుడు ఈ అనుమతి చెల్లదని హైకోర్టుకు వెళ్ళారు. హైకోర్టు అనుమతి చెల్లుతుందని తేల్చి చెప్పింది. ఆ తీర్పును నిర్మల్ యాదవ్ సుప్రీం కోర్టులో సవాలు చేయగా, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురయింది.

కేసును తాత్సారం చేయడానికి ఆమె వేసిన మరెన్నో పిటిషన్లు కూడా గడిచిన తర్వాత, చివరికి 2013 మేలో నెల లోపు దర్యాప్తు, చార్జెస్ ఫ్రేమ్ ప్రక్రియలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అలా అవినీతి సొమ్ము దొరికిన ఐదు సంవత్సరాల తర్వాత సీబీఐ ప్రత్యేక కోర్టులో కేసు మొదలయింది. ఏడున్నర సంవ త్సరాల తర్వాత చార్జెస్ ఫ్రేమ్ అయి విచారణ మొదలయింది.

ఈలోగా జస్టిస్ నిర్మల్ యాదవ్ పదవీ విరమణ జరిగింది. సంజీవ్ బన్సాల్ మరణించాడు. డబ్బు పట్టుకొచ్చిన గుమాస్తా మరణించాడు. నలుగురు కీలక సాక్షులు అడ్డం తిరిగారు. న్యాయస్థానం దాదాపు 70 మంది సాక్షులను విచారించింది. ఇలా ఎన్నెన్నో అవరోధాలు దాటి, ఘటన జరిగిన 17 సంవత్సరాల తర్వాత, కేసు మొదలైన 14 సంవత్సరాల తర్వాత... ఎట్టకేలకు సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అల్కా మాలిక్ సరిపోయినన్ని సాక్ష్యాధారాలు లేవని, సాక్షుల వ్యాలాల్లో వైరుధ్యాలున్నాయని కేసు కొట్టేశారు. ఎంత నిర్మలమైన న్యాయం!!

# వేరువేరు ప్రాంతాల్లో పిడుగులు..

## ముగ్గురు ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు !

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందారు. పిడుగుపాటుకు . ఈదమ్మ (55), సైదమ్మ (35) ప్రాణాలు కోల్పోయారు. వీరు వేరుశనగ పొలాల్లో కూలీ పనులకు వెళ్లిన సమయంలో పిడుగుపాటుకు గురైయ్యారు. వీరి మరణంతో స్థానికంగా విషాదం నెలకొంది. ఎమ్మిగనూరు మండలం కందనాతిలో.. రవి (15) అనే బాలుడు పొలం పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బాలుడు రవి చెట్టు కిందికి చేరుకునేలోపే పిడుగు పడింది. రవి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు పొలంలో పనిచేస్తున్న పలువురికి గాయాలవ్వగా వారిని వెంటనే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి మరణంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

**పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలు**

జిల్లాలోని సి.బెళగల్ మండలంలో గురువారం భారీ వర్షాలకు పిడుగుపాటుకు ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలో అకస్మాత్తుగా భారీ వర్షం పడటంతో, దాదాపు 50 మంది వాహనదారులు ఇనగండ్ల క్రాస్ రోడ్‌లోని బస్ స్టాండ్‌లో తలదాచుకున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటంతో బస్ స్టాండ్‌లో అకస్మాత్తుగా పిడుగు పడింది. దీంతో బస్ స్టాండ్‌లో ఉన్న



ఐదుగురు పిడుగుపాటు కారణంగా తీవ్రంగా గాయపడ్డారు. గాయాలైన ఐదుగురిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటలకు తరలించారు. ఇనగండ్ల క్రాస్ రోడ్డులోని బస్టాండ్.. పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతింది.

## అమరావతి నిర్మాణంలో కీలక పరిణామం..

# సింగపూర్ సడన్ ఎంట్రీ!

చేయాలని గట్టి సంకల్పంతో ఉంది రాష్ట్ర ప్రభుత్వం.

**ప్రతినిధుల బృందం రాక..**

మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణంలో సింగపూర్( %ూఅఅస్త్రుజూశీతీవ%) భాగస్వామ్యం కానుంది. ఈరోజు సింగపూర్ కు చెందిన ప్రతినిధుల బృందం అమరావతి రాజధాని లో పర్యటించింది. ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తోంది. ప్రధానంగా వరద పోటుకు తట్టుకునే విధంగా తీసుకుంటున్న చర్యలు, పూర్వపు నిర్మాణాల పరిస్థితి వంటివి ఆరా తీస్తోంది ఈ బృందం. అయితే ఇప్పటికే పలుమార్లు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కూడా అమరావతి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించింది. చిన్న చిన్న అభ్యంతరాలు తప్ప.. పెద్దవేవి చేయలేదు. ఇప్పుడు కూడా సింగపూర్ ప్రతినిధి బృందం అమరావతి రాజధానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పైగా అమరావతి రాజధాని నిర్మాణంలో ఏపీ నుంచి వెళ్లిన ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా ఉండడంతో సింగపూర్ ప్రభుత్వం సైతం ఆసక్తి చూపుతోంది.

**అప్పట్లో సింగపూర్ సహకారం..**

2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని ప్రారంభించింది. అప్పట్లో సింగపూర్ సహకారం తీసుకుంది. సీడ్ క్యాపిటల్ కింద 1900 ఎకరాలను కేటాయించింది. అయితే అప్పట్లో రాజధాని నిర్మాణ పనుల్లో భాగస్వామ్యం అయింది సింగపూర్ ప్రభుత్వం. అయితే వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగపూర్ భాగస్వామ్యంతో భారీ అవినీతి జరిగిందని అభియోగాలు మోపింది జగన్ సర్కార్. చంద్రబాబు అరెస్ట్ సమయంలో సింగపూర్ పేరు ప్రముఖంగా వినిపించింది. అమరావతి రాజధాని నిర్మాణ సమయంలో చంద్రబాబు సింగపూర్ ను అడ్డం పెట్టుకొని భారీగా అవినీతి చేశారని ఆరోపించింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధాని నిర్మాణానికి కదలిక వచ్చింది. కానీ గతంలో వచ్చిన విమర్శలను పట్టించుకోకుండా చంద్రబాబు సర్కార్ సింగపూర్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

**ముందుకు వస్తున్న సంస్థలు..**

అమరావతి రాజధాని( %ూమ్రితీఝజ్ఙ్త్రఉ ఝజూఞ్ఝశ్రీ% ) నిర్మాణ పనులు పున ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో వివిధ సంస్థలకు కేటాయించిన భూముల్లో వారి నిర్మాణాలు ప్రారంభించిన చర్యలు చేపట్టింది కూటమి ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థలు సైతం తమ కార్యకలాపాలను మొదలు పెట్టేందుకు సిద్ధపడుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఏపీ ప్రభుత్వంతో కలిసి అమరావతి రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని చూస్తోంది సింగపూర్. తాజాగా ప్రతినిధుల బృందం పరిశీలన తర్వాత కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. మొత్తానికి అయితే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సింగపూర్ సైతం సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్తోంది.

# ముగిసిన ఎపి కేబినెట్

తెలిపింది. డ్రోన్ కార్పొరేషన్‌ను స్వతంత్ర విభాగంగా చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. త్రీ స్టార్, ఆ పైబడిన హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజులను రూ.25లక్షలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. హడ్కోకు రూ.710 కోట్ల గ్యారెంటీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. మీడియా అక్రిడేషన్ల నూతన నిబంధనలకు ఆమోదం తెలిపింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెంపాడులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.45 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును జలహారతి కార్పొరేషన్ పేరిట ప్రత్యేక వాహక ప్రాజెక్టుగా పరిగణిస్తూ ఎపి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వివిధశాఖల మంత్రులు, ప్రభుత్వ ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

క్యాబినెట్‌లో ఆమోదం పొందిన అంశాలు

8 అనకాపల్లి జిల్లాలోని డీఎల్‌పురం వద్ద క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు ఆమోదం
8 త్రీ స్టార్, ఆ పైబడిన హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజుల కుదింపునకు ఆమోదం. బార్ లైసెన్స్‌ల ఫీజును రూ.25లక్షలకు కుదిస్తూ ఆమోదం
8 యువజన, పర్యాటక శాఖ జీవోల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం
8 రూ.710కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు ఆమోదం

# టీటీడీలో భారీ సంస్కరణలు!

వుండేవారు. సీఎం సొంత ప్రాంతం కావడం.. వారి కులదైవం కావడం.. అన్నింటికి మించి కోట్లాది మంది హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీవారి క్షేత్రం పవిత్రతను కాపాడేందుకు ప్రాధాన్యత ఇచ్చేవారు. గతంలో సీఎంగా వున్న సమయంలో రాజకీయ జోక్యానికి కూడా చంద్రబాబు అంగీకరించేవారు కాదు. అధికారులు కన్నుసన్నలోనే తిరుమల పరిపాలన వ్యవహారాలు కొనసాగేది. గతంలో ఎమ్మెల్యేగా వున్న చదలవాడ కృష్ణమూర్తి తిరుమల స్థానికులకు మద్దతుగా సీఎం దగ్గర అధికారులకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రయత్నం చేసిన సీఎం వారించి.. తిరుమల విషయంలో జోక్యం చేసుకోవద్దు సుతిమెత్తగా హెచ్చరించారు. ఇక తిరుమలలో అత్యంత క్లిష్టమైన మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకుంది చంద్రబాబు సీఎంగా వున్న సమయంలోనే.. ఆలయ అభివృద్ధి కోసం మాడవీధులతో పాటు తిరుమలలో వున్న ప్రైవేట్ ఆస్తులు టీటీడీ స్వాధీనం చేసుకొని.. వాటిని భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి చేసింది చంద్రబాబు హయాంలోనే.. పెద్దవారికి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రాణదాన పథకాని చంద్రబాబే ప్రారంభించారు. తిరుమలలో శ్రీవారి భక్తులకు శాశ్వత ప్రాతిపాదికన త్రాగునీటి కష్టాలు తొలగించేందుకు తిరుపతి కళ్యాణి డ్యాం నుంచి తిరుమలకు నీరు తరలించేందుకు పైపు లైన్ ఏర్పాటు చేసింది చంద్రబాబు సీఎంగా వున్న సమయంలోనే.. ఇలా గతంలో సీఎంగా వున్న సమయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన చంద్రబాబు.. తాజాగా, సీఎంగా భాధ్యతలు స్వీకరించిన తరువాత తిరుమల పై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సీఎంగా భాధ్యతలు స్వీకరించిన వెంటనే స్వామివారి ఆశీస్సులు పొందడానికి తిరుమలకు వెళ్లిన సీఎం.. తిరుమల ప్రక్షాళన ప్రారంభిస్తున్నామని.. తమ ప్రభుత్వ హయంలో తిరుమల పవిత్రతను కాపాడేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అందులో భాగంగా తిరుమలకు వచ్చిన ప్రతి సారి అధికారులతో సమావేశం అవుతూ భక్తులకు కల్పించే సౌకర్యాలపై దిశా నిర్దేశం చేయడం ప్రారంభించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని ఆదేశించిన సీఎం.. తాజాగా విదేశాల్లో కూడా ఆలయాలు నిర్మాణానికి వున్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో పచ్చదనాన్ని 67 శాతం నుండి 80 శాతానికి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శ్రీవారి ప్రసాదం నాణ్యత పెంచేందుకు నాణ్యమైన నెయ్యిని వినియోగించేలా మార్పులు తీసుకురాగా.. ఆర్గానిగ్ ముడుసరుకులు స్థానంలో గతంలో వున్న విధానాన్ని తిరిగి తీసుకువచ్చారు. మరో వైపు ఏఐ టెక్నాలజీని వినియోగించి శ్రీవారి భక్తులకు సులుభతరంగా సేవలు అందించడానికి వున్న అవకాశాలను పరిశీలించాలని.. వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తులకు టీటీడీ అందించే సేవల వివరాలను తెలిపేందుకు పారదర్శకతతో కూడిని విధానాన్ని అమలులోకి తీసుకురావాలని సూచించారు.. అలిపిరి వద్ద భక్తుల సౌకర్యార్థం బేస్ క్యాంప్ ఏర్పాటు, మాడవీధుల గ్యాలరీ విస్తరణ వంటి అంశాలపై గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం.. టీటీడీ రాబోవు 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో వుంచుకొని తిరుమలను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇలా మొత్తంగా తిరుమల అభివృద్ధి పై మరోసారి మాస్టర్ మైండ్ తో సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఇచ్చిన మాట ప్రకారమే.. పేదలకు 'పట్టా'భిషేకం

ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రుషికొండ ప్యాలెస్‌పై చంద్రబాబు ఫోకస్

విస్తీర్ణంలో మొత్తం ఏడు బ్లాక్‌లుగా నిర్మించారు. ఈ భవనాల నిర్మాణ వ్యయం సుమారు రూ.400-500 కోట్లుగా అంచనా. విలాసవంతమైన ఇటాలియన్ మార్బుల్, ఖరీదైన ఫర్నీచర్, షాండ్లియర్లు, ఆధునిక సౌకర్యాలు ఇందులో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం వీఐపీల కోసం వీటిని నిర్మించిందని వైసీపీ చెబుతున్నప్పటికీ, టీడీపీ, జనసేన ఈ భవనాలను జగన్ వ్యక్తిగత ఉపయోగం కోసం నిర్మించారని ఆరోపిస్తున్నాయి. వైసీపీ పరాజయం అనంతరం, రుషికొండ భవనాలను కొత్త ప్రభుత్వం ఎలా ఉపయోగించుకుంటుందనే ఆసక్తి నెలకొంది.

**పర్యాటక కేంద్రంగా మారతాయా? లేక కూల్చివేస్తారా?**

రుషికొండ భవనాల నిర్మాణానికి అనుమతులు లేకుండా పర్యావరణానికి భంగం కలిగించారని టీడీపీ, జనసేన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విమర్శించాయి. ఇప్పుడు ఈ రెండు పార్టీలు అధికారంలోకి రావడంతో ఈ భవనాలను కొనసాగిస్తారా? లేక కూల్చివేస్తారా? అనే చర్చ నడుస్తోంది. వందల కోట్ల రూపాయల ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన ఈ భవనాలను పర్యాటక రంగం అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరు మ్యూజియంగా మార్చాలని సూచిస్తున్నారు.

**ముందుగా మంత్రుల పర్యటన %-% ఆపై నిర్ణయం**

ఈ భవనాల భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ముందు మంత్రులందరూ రుషికొండ ప్యాలెస్‌ను సందర్శించాలని చంద్రబాబు సూచించారు. మంత్రుల పర్యటన అనంతరం వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత భవనాల భవితవ్యంపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ భవనాలను ప్రయోజనకరంగా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రుషికొండ భవనాల వాడకంపై త్వరలోనే ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయనుందని తెలుస్తోంది.

# ఆ 25వేల టీచర్ల నియామకాలు చెల్లవు..

## దీదీ సర్కారుకు సుప్రీం షాక్




**దిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లపై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 25వేల టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ నియామకాలను రద్దు చేస్తూ గతంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం సమర్థించింది.**

ఈ కుంభకోణంపై గతేడాది ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీనికింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

దీనిపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. తాజాగా తీర్పు వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనది, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టంచేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కాస్త ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

ఇక, మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దివ్యాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారు విధుల్లో కొనసాగొచ్చని స్పష్టంచేసింది. ఇక, ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ దీదీ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 4న విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీని ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# అనురాగ్ ఠాకూర్ ఆరోపణలు..

## పుష్ప డైలాగ్‌తో కౌంటర్ ఇచ్చిన ఖర్గే



**దిల్లీ: రాజ్యసభలో గురువారం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. వక్ఫ్ భూమిని కబ్జా చేశారంటూ భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేత.. రాజకీయ దాడులకు తాను బెదిరిపోనని పేర్కొంటూ పుష్ప సినిమాలోని తగ్గేదేలే డైలాగ్ చెప్పారు. అసలేం జరిగిందంటే..**

వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా భాజపా నేత అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఖర్గేపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు బాధ్యతారహితంగా వినియోగిస్తున్నాయని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఆ భూములను కబ్జా చేశారంటూ ఖర్గేపై ఆరోపణలు చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు.

ఈనేపథ్యంలో గురువారం రాజ్యసభలో జీరో అవర్‌లో మాట్లాడుతూ ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ నిన్న నాపై అసత్య, నిరాధార ఆరోపణలు చేశారు. మా పార్టీ ఎంపీలు ప్రశ్నించడంతో ఆ వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకున్నారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సామాజిక మాధ్యమాలు, మీడియాల్లో భాజపా ఎంపీ చేసిన ఆరోపణలే వైరల్ అవుతున్నాయి. అందువల్లే ఈ రోజు నేను నిలబడి ఆయన ఆరోపణలను ఖండించాల్సి వస్తోంది. ఆయన వ్యాఖ్యలకు గానూ సభాపక్ష నేత క్షమాపణలు చెప్పాలి" అని ఖర్గే డిమాండ్ చేశారు.

"నా జీవితం తెరిచిన పుస్తకం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా. అయినప్పటికీ ప్రజా జీవితంలో తలెత్తుకొని నిలబడ్డా. అలాంటి నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ ఆరోపణలను ఠాకూర్ నిరూపించగలరా? ఒకవేళ అలా చేస్తే నేను రాజీనామా చేస్తా. లేదంటే ఆయనకు పార్లమెంట్‌లో ఉండే అర్హత లేదు. రాజీనామా చేయాల్సిందే. ఇలాంటి రాజకీయ దాడులతో భాజపా నేతలు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. గుర్తుంచుకోండి. నేను ఎవరికీ భయపడను. తలొగ్గను" అని ఖర్గే అన్నారు.

# ట్రంప్ సుంకాలపై దీటుగా స్పందిస్తాం: చైనా



**చైనా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాల ప్రకటనపై చైనా తీవ్రంగా స్పందించింది. యూఎస్ వీటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించింది. బీజింగ్ వాణిజ్య మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో ఈమేరకు వ్యాఖ్యానించింది.**

చైనా దిగుమతులపై ట్రంప్ 34 శాతం సుంకం ప్రకటించారు. దీనిపై డ్రాగన్ స్పందిస్తూ.. 'అమెరికా టారిఫ్‌లను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్రంప్ ప్రకటన ఏకపక్షంగా ఉంది. ఇవి అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా లేవు. ప్రపంచ ఆర్థికాభివృద్ధిని ప్రమాదంలో పడేస్తాయి. వాటిని తక్షణమే వెనక్కి తీసుకోండి. వాణిజ్య విభేదాలను చర్చలతో పరిష్కరించుకోవాలి. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు' అని పేర్కొంది. ఈసందర్భంగా తమ సొంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు దృఢంగా ప్రతిస్పందిస్తామని ప్రతిజ్ఞ చేసింది. చైనా దిగుమతులపై ఇప్పటికే ఉన్న 20 శాతం సుంకాలను ఆయన 34 శాతానికి చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇది ఫెంటనిల్ డ్రగ్ అక్రమాలను అడ్డుకోవడానికి దోహదపడుతోందని వైట్‌హౌస్ పేర్కొంది.

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన వెంటనే ట్రంప్ ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. తమతో వ్యాపారం చేస్తున్న దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానన్నారు. అందులోభాగంగానే బుధవారం టారిఫ్‌లను ప్రకటించారు. ఈ రోజును ఆయన 'లిబరేషన్ డే'గా అభివర్ణించారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని స్పష్టంచేశారు. తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఇతర దేశాలపై మాత్రం.. ఆయా దేశాలు విధిస్తున్న సుంకాల్లో సగం మేర తాము విధిస్తున్నట్లు వెల్లడించారు.

# బంగాళాఖాతంలో భారత్‌కు పొడవైన తీర రేఖ

## యూనస్‌కు జైశంకర్ స్ట్రాంగ్ కౌంటర్



**దిల్లీ: బంగాళాఖాతంలో భారత్‌కు పొడవైన తీర రేఖ ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. బిమ్‌స్టెక్ బాధ్యతలపై భారత్‌కు సంపూర్ణ అవగాహన ఉందని పేర్కొన్నారు. సహకారం ఒక సమగ్ర దృక్పథం అని భారత్ విశ్వసిస్తుందని వ్యాఖ్యానించారు. థాయ్‌లాండ్‌లో జరుగుతోన్న ఆరవ బిమ్‌స్టెక్ సదస్సులో ఆయన ఈమేరకు మాట్లాడారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఇటీవల బంగాళాఖాతంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో తాజా స్పందన వచ్చింది.**

"బంగాళాఖాతం చుట్టూ ఉన్న, దానికి సమీపంలోని దేశాలకు ఉమ్మడి ఆసక్తులు, ఆందోళనలు రెండూ ఉన్నాయి. వాటిలో కొన్నింటికి మన చరిత్ర దోహదం చేసింది. ఇతర ప్రాధాన్యాలు ఈ ప్రాంతం శ్రేయస్సును పక్కనపెట్టాయి. బంగాళాఖాతంలో భారత్‌కు 6,500కి.మీ. మేర పొడవైన తీరరేఖ ఉంది. భారతదేశం ఐదు బిమ్స్‌స్టెక్ సభ్య దేశాలతో సరిహద్దును కలిగిఉంది. అలాగే ఆసియన్ దేశాలతో అనుసంధానాన్ని అందిస్తోంది. ముఖ్యంగా మా ఈశాన్య ప్రాంతం బిమ్స్‌స్టెక్ కనెక్టివిటీ హబ్‌గా వృద్ధి చెందుతోంది. రోడ్లు, రైల్వేలు, జలమార్గాలు, గ్రిడ్‌లు, పైప్‌లైన్ నెట్‌వర్క్‌లతో ఈ ప్రాంతం పసిఫిక్ మహాసముద్రం వరకు అనుసంధానం అవుతోంది. ఇది నిజంగా గేమ్ ఛేంజర్. ఈ విశాల భౌగోళిక ప్రాంతంలో వస్తువులు, సేవల సరఫరా, ప్రజల మధ్య సంబంధాలు సజావుగా సాగడానికి మన మధ్య సహకారం, సౌకర్యాలు అవసరమని మేం గ్రహించాం. ఈ భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులను దృష్టిలోఉంచుకొని.. గత దశాబ్దకాలంగా బిమ్స్‌స్టెక్ బలోపేతం కోసం అత్యంత శ్రద్ధ వహిస్తున్నాం. ఈ సహకారం ఒక సమగ్ర దృక్పథం అని భారత్ విశ్వసిస్తుంది. నచ్చినవి ఎంచుకొని మిగిలినవి వదిలేయడం కుదరదు" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

ఇటీవల చైనా పర్యటనకు వెళ్లిన యూనస్.. భారత్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆగ్రహానికి కారణమయ్యాయి. "భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు పూర్తిగా భూపరివేష్టితమైవున్నందున బంగాళా ఖాతానికి మేమే సంరక్షకులం. ఇదొక పెద్ద ప్రయోజనానికి అవకాశం కల్పిస్తోంది. అందుకే మా దేశంలో పెట్టుబడులు పెట్టండి" అని యూనస్ చైనాను ఆహ్వానించారు. యూనస్ తీరును మన దేశ నేతలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం" అని ఆందోళన వ్యక్తంచేశారు. అవి ప్రమాదకర వ్యాఖ్యలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు.

# ప్రభుత్వమే సర్వోన్నతం

## రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ వ్యాఖ్య



**దిల్లీ: ప్రభుత్వమే సర్వోన్నతమైనదని రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ బుధవారం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పాలన అనేది కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారా మాత్రమే సాగుతుందని, న్యాయస్థానాల వల్ల కాదన్నారు. ఎందుకంటే ప్రభుత్వం పార్లమెంటుకు, దానిని ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీ అని వివరించారు. 'నీట్' కేంద్రీకరణపై గతంలో సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రస్తావించిన సమయంలో రాజ్యసభ ఛైర్మన్ ఈ విధంగా స్పందించారు.**

రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్‌వీఎన్ సోమూ మాట్లాడుతూ.. జాతీయ అర్హత పరీక్ష 'నీట్'ను వికేంద్రీకరించాలని డిమాండు చేశారు. దీనిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. గతంలో దీనిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన ఆయన, కేంద్రీకృత విధానాన్ని న్యాయస్థానం కూడా సమర్థించిందన్నారు. ఈ క్రమంలోనే జోక్యం చేసుకున్న ఛైర్మన్.. ప్రజాస్వామ్యంలో పాలన కేవలం కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారానే సాగుతుందన్నారు.

ఎందుకంటే.. ఎగ్జిక్యూటివ్ అనేది పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుందన్న ఆయన.. ఇది ఇతర ఏజెన్సీల ద్వారా ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శుక్రవారం 04 ఏప్రిల్ 2025


## గల్ఫ్ గృహ కార్మికులు హెల్పింగ్ హాండ్స్ రూ.15,500 ఆర్థిక సహాయం



**మలికిపురం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు జిల్లెళ్ళ జయరాజు కుమార్తె "అభినయ"పుట్టినరోజు సందర్భంగా ఒక కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.అదేవిధంగా అనేక ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేశారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలోని రాంబాగ్ వద్ద గత కొంత కాలంగా యడ్ల సామ్యూల్ దంపతుల అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 వేల 500 లను వై.ఎస్.ఆర్.సీ.పీ.సీనియర్ నాయకులు నల్లి డేవిడ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్ సంస్థ వారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే కాకుండా అనేక ప్రాంతాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నారని ఈ సందర్భంగా సంస్థ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి స్వచ్ఛంద సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని తమ వంతు సహాయ సహకారాలు సమాజానికి అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ నవోదయ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ యూనియన్ అధ్యక్షులు రాపాక చిన్ని,ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్ బాబు,శ్రీ అరుణోదయా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ శర్మ కి తిరుపతి వేదిక్ యూనివర్సిటీ ప్రశంసా పత్రం




**ఆలమూరు, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శైవాగమ యువ కిషోర్ ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ కాళ్లకూరి రవితేజ శర్మకి తిరుపతి శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శైవాగమ పండిత ప్రశంసా పత్రం తిరుపతిలో అందజేశారు. గత 21 రోజులుగా జరుగుతున్న ఆన్ లైన్ క్లాసుల్లో వేదిక్ యూనివర్సిటీ ద్వారా శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాలలో నిర్వహించారు. ఈ క్లాసులలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి తిరుపతిలో వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో "ఇంటర్నేషనల్ ప్రశంస పత్రాలతో " పాటు గుర్తింపు పత్రాలను అందించారు.ఈ క్లాసులలో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన రవితేజ వర్మ కి శైవాగమ శాస్త్ర సారావళి జ్ఞానపాదం విభాగంలో ప్రశంసాపత్రం, గుర్తింపు పత్రం లను అందజేశారు.

## ఆక్వా జోన్‌ను తీవ్రంగా వ్యతిరేఖించిన రైతులు.

**వెలువలపల్లి గ్రామ సభ ఎదుట లిఖిత పూర్వక అభ్యంతరం.**

**అనుమతులు లేని చెరువులను ధ్వంసం చేయాలని డిమాండ్.**



**అయినవిల్లి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సంవత్సరానికి మూడు పంటలు పండే సారవంతమైన వరిచేలను రొయ్యల చెరువులుగా మార్చడాన్ని ఎంత మాత్రం అనుమతించబోమని వెలువలపల్లి గ్రామానికి చెందిన రైతులు అధికారులకు స్పష్టం చేశారు. మండలంలోని వెలువలపల్లి గ్రామంలో ఆక్వా జోన్ ఏర్పాటు విషయమై గ్రామసభ స్థానిక సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలువలపల్లి గ్రామానికి చెందిన, గ్రామంలో పొలాలు కలిగిన రైతులు పెద్ద ఎత్తున గ్రామసభకు అధికారుల ఎదుట హాజరయ్యారు. మత్స అభివృద్ధి అధికారి (ఎఫ్.డి.ఒ) త్రిమూర్తులు ఎదుట రైతులు పలు అభ్యంతరాలను వెలిబుచ్చారు. పంటల సాగుకు ఎంతో అనువైన సారవంతమైన నేలలను ఆక్వా జోన్ గా మార్చేందుకు అధికారులు చేసే ఏ ప్రయత్నాన్ని తాము అనుమతించబోమని స్పష్టం చేసారు. అనుమతులు లేకుండా చెరువులు తవ్విన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అనుమతులు లేకుండా సాగవుతున్న చెరువులను ధ్వంసం చేయాలని అధికారులను డిమాండ్ చేసారు. సదరు చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిన విద్యుత్ శాఖాధికారులు పై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సాగుకు ప్రతిబంధకంగా మారుతూ, సాగు నీటి కాలుష్యానికి కారణం అవుతూ, ముంపు నీరు దిగేందుకు అడ్డంకిగా మారుతూ, భూగర్భ జలాలను కలుషితం చేస్తూ, స్థానిక ప్రజల ఆహార లభ్యతను దెబ్బతీసే రొయ్యల చెరువులను ఎట్టి పరిస్థితిలోనూ అధికారులు అనుమతించ రాదని కోరారు.. ఈ విషయాలపై వారు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ డిమాండ్లను సకాలంలో నెరవేర్చకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి చక్ర రామారావు గ్రామ సర్పంచ్ బొంతు మణి , టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా వనుములు రావు, వైసిపి సీనియర్ నాయకుడు బొంతు శ్రీనివాసరావు కె.రామకృష్ణ రాజు బడుగు వెంకటేష్ పరమట నాని మేడిశెట్టి శంకర్రావు అడపా సత్తిరాజు మేడి శెట్టి వెంకటేశ్వరరావు సుంకర కోటేశ్వరరావు నిల్లా సూర్యనారాయణ పెయ్యిల సత్యనారాయణ సత్యాల రమణ గొల్లకోటి బాపూజీ అడప దుర్గారావు అడప వెంకటేశ్వరరావు మోరంపూడి వెంకటేశ్వరరావు చల్లబత్తుల శ్రీను చల్లబత్తుల మహాలక్ష్మి మోత రామకృష్ణ మోత కోటేశ్వరరావు సుంకర వెంకటేశ్వరరావు అందే సత్యనారాయణ, ఆర్ సోమలింగం మోత దుర్గా వెంకటేశ్వరరావు తదితరులు ఆక్వా జోన్ ను వ్యతిరేకించి అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

# కోనసీమను కోకో హబ్‌గా తీర్చిదిద్దాలి

- కొబ్బరిలో అంతర పంటగా కోకో లాభదాయకం
- 1000 ఎకరాలకు ఒక కామన్ పర్మింటేషన్ కేంద్రం
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగుకు ఎంతో అనువైన వాతావరణం ఉందని ఆ దిశగా కోకో సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా పెంచుతూ కోకో హబ్ గా జిల్లాను తీర్చిదిద్దాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉద్యాన అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ లో గురువారం జిల్లాస్థాయి కోకో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. కోకో కాయల కోత అనంతరం ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకై చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఏక పంటగా కొబ్బరి సాగు విరాజిల్లేదని అయితే ఫీడ్ నల్లి తాకిడితో కొబ్బరి దిగుబడి తగ్గిపోయి కేవలం కొబ్బరిపై ఆధార పడి రైతు మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి తరుణంలో రైతును అన్ని విధాలుగా ఆదుకుంది కోకో పంటని, కాబట్టి కొబ్బరిలో అంతర పంటగా సాగు చేయడానికి అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని చెప్పారు. నాటిన మూడో ఏడాది నుంచి నుండి దిగుబడి వస్తుందన్నారు. కాయల నుంచి తీసిన గింజలను నాణ్యతతో ప్రాసెసింగ్ చేసే విధానాలపై స్థానిక రైతులకు అవగాహన లేకపోవడంతో గిట్టుబాటు ధరలు పొందలేకపోతున్న నేపథ్యంలో వెయ్యి ఎకరాలకు ఒక కామన్ పర్మింటేషన్ కేంద్రాన్ని ఒక ఎకరం స్థలంలో నెలకొల్పే దిశగా సమగ్ర ప్రతిపాదనలు రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాయలు కోత, పులియబెట్టే పద్ధతి, బుట్ట పద్ధతి, కృత్రిమంగా ఎండబెట్టుట, గింజల గ్రేడింగ్, నిల్వ చేయడం అంశాలకు సంబంధించి యూనిట్ నెలకొల్పేందుకు షెడ్లు నిర్మాణం మానవ వనరుల లభ్యత, వివిధ రకాల పరికరాలు ఏర్పాటు శాస్త్రవేత్తల సమన్వయంతో సమగ్రమైన ప్రతిపాదనలను రూపొందించి సమర్పించాలన్నారు. ప్రభుత్వ పరంగానే యూనిట్లు నెలకొల్పుతూ రైతుల నుంచి నేరుగా కాయలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసి పూర్తి నాణ్యత ప్రమాణాలతో గింజలను రూపొందించి కంపెనీలకు విక్రయించడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయంగా మంచి గిరాకీ కలిగిన కోకో పంట ప్రాసెసింగ్ విధానం మెరుగుపరిచేందుకై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దేశీయ అవసరాలకు సరిపడా దిగుబడులు లేనందున ఈ పంటకు మంచి భవిష్యత్తు ఉండి ఆశాజనకంగా మారుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారన్నారు. ఒకప్పుడు కొబ్బరి ప్రధాన పంట అయినా కొబ్బరిపంట వల్ల నేడు ఆదాయం తగ్గి , ముఖ్యమైన ఆదాయ వనరుగా కోకో పంట మారిందన్నారు. కొబ్బరిలో అంతర పంటల సాగులో దీన్ని భాగం చేసుకుని ఎంతో మంది రైతులు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,500 ఎకరాల్లో కోకో పంట ఉందని దీనిని దశలవారీగా ఏడాదికి వెయ్యి ఎకరాలు చొప్పున విస్తీర్ణాన్ని పెంచేందుకు కార్యాచరణ అమలు కాబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత, శాస్త్రవేత్త నవీన్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి బి.వి.రమణ, రమ్య ఫుడ్స్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీ.కే.పీ.ప్రసాద్, ఉద్యాన అధికారులు దిలీప్, చందన తదితరులు పాల్గొన్నారు.








## రైతు బజార్‌కు రైతుల ఎంపిక



**అయినవిల్లి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రైతులు పండించే కూరగాయలను నేరుగా రైతు బజార్లో అమ్ముకునే విధంగా రైతులకు అవకాశం కల్పించినట్లు ఉద్యానవన శాఖ అధికారిణి లక్ష్మీ ప్రసన్న గురువారం తెలిపారు. మండలంలో వీరవల్లిపాలెం తొత్తరమూడి శానపల్లిలంక మడుపల్లి గ్రామాల నుండి అమలాపురం రైతు బజార్లో కూరగాయలు విక్రయించు కునేందుకు 15 మంది రైతులకు అవకాశం కల్పించినట్లు ఆమె వివరించారు. మండలంలో 287 హెక్టార్ లలో 150 మంది రైతులు కూరగాయ పంటలను సాగు చేస్తున్నారన్నారు. రైతులు సస్యరక్షణ నీటి యాజమాన్యం పద్ధతులను సమయానుకూలంగా పాటించి సంబంధిత అధికారుల సలహాలను పాటించి అధిక దిగుబడులను సాధించాలని రైతులకు సూచించారు.

## కల్వరి మందిరం ఆధ్వర్యంలో రాజశేఖర్( రాక్ ) కు ఘన సన్మానం



**సఖినేటిపల్లి ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక ఓ. ఎన్.జి.సి కాలనీ దగ్గర ఉన్న మహెూన్నతుడు కల్వరి మందిరం నందు జరిగిన సువార్త సభలో ముఖ్య ప్రసంగీకులు జార్జ్ బుష్ తమ ప్రసంగాన్ని తెలియజేస్తూ దేవుని వాక్యం పట్ల శ్రద్ధ కలిగి తోటి వారికి సహాయం చేయి గల ప్రేమ కలిగి ఉండాలని ఎదుటి వ్యక్తిని ప్రేమించే గుణం ఉండాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అమెరికా లో స్థిరపడి ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా చొప్పల రాజశేఖర్ అమెరికాలో స్థిరపడి ఇండియా రామరాజు లంక గ్రామానికి చెందిన రాజశేఖర్ సామాజిక సేవా దృక్పథంతో అనేకమైన సేవా కార్యక్రమాలు స్కూళ్లలో విద్యార్థులు కావలసిన మౌలిక వసతులు కల్పించడంలోను.విత%శీ%తువులకు బ్లాంకెట్స్ అందించి తన వంతు కృషి చేస్తున్నారని ఆయన చేస్తున్న సేవలకు మహెూన్నతుడు కల్వరి మందిరం వారు ఆత్మీయ సేవా సత్కారం శాలువా తో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న,దైవ సేవకులు,పాస్టర్,గంటా షారోను,రాపాక మోహన్,దొండపాటి భరత్ రావు,దేవ ప్రవీణ్,మలికిపురం రోటరీ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్,సంఘ కాపరి,నెల్లూరి రాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు క్లాసులు పంపిణీ

**మలికిపురం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలికిపురం మండలం రామరాజులంక గ్రామానికి చెందిన అమెరికన్ సిటిజెన్సీ చొప్పల రాబర్ట్ జూనియర్ అమెరికా (ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ యూ,ఎస్,ఏ) ఆర్థిక సహాయంతో అనేక సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సఖినేటిపల్లి మండలం అప్పన్న రాముని లంక గ్రామంలో పిల్లలకు పదివేల రూపాయలు విలువగల భోజనం ప్లేట్లు,గ్లాసులు,వారి తండ్రి రాజశేఖర్ చొప్పల అమెరికన్ సిటిజెన్సీ (ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా) వారిసౌజన్యం లో పంపిణీ చేయడం జరిగింది.ఇంకా అనేకమైన ప్రాంతాలలో కుట్టు మిషన్లు,పాఠశాల కావలసిన వాటర్ ఫిల్టర్లు, వృద్ధులకు వితంతువులకు దుప్పట్ల పంపిణీ చేస్తూ తమ పుట్టిన గ్రామానికి ఏదో సేవ చేయాలనే దృక్పథంతో రామరాజులంక చొప్పల రాజశేఖర్ కుటుంబం చేస్తున్న సేవలు గురించి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ నల్లి శివకుమార్,నెల్లూరి రాజు,రామ్మూర్తి,ప్రేమ్ కిరణ్,నరసింహస్వామి,సుధాకర్,నరేష్,దేవ దయానంద్ పాల్గొన్నారు.




## సత్తిరాంబాబుకు ఎమ్మెల్యే అయితాబత్తుల నివాళి

**అమలాపురం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సవరపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసి అకాల మరణం చెందిన సత్తి రాంబాబుకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దర్బార్ కేఫ్ ప్రారంభం



**అమలాపురం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్థానిక ఎర్ర వంతెన వద్ద దర్బార్ కేఫ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేఫ్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు.



## రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గున్న బడేటి చంటి



ఏలూరు ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఉద్ఘాటించారు. అభివృద్ధికి బాటలు వేసేక్రమంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏలూరులో శాంతినగర్ నుండి సెయింట్ అన్స్ కాలేజ్ వరకూ 22, 23, 24 డివిజన్ల పరిధిలో 4కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్డు నిర్మాణానికి గురువారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాడైపోయిన రహదారుల పునర్నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దీనికి అవసరమైన కోట్లాది రూపాయల నిధులను విడుదల చేయడంతో రహదారుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయగలిగామన్నారు. దీంతో ఎక్కడ చూసినా రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా నూతన రహదారుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎమ్మెల్యే సూచించారు. నగర మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టిసారించిన ఎమ్మెల్యే బడేటి చంటి సారథ్యంలో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. తొలుత ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబులకు ఆత్మీయ స్వాగతం లభించింది. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ ఎ. భానుప్రతాప్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, నాయకులు వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి, గూడవల్లి వాసు, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, కేతినేడి భాస్కరరావు, అట్లూరి రామకృష్ణ, అన్నపనేని రవికుమార్, కడియాల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున పని దినాల కల్పన.



భీమవరం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున పని దినాల కల్పనకు కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం మొగల్తూరు మండలం వారతిప్ప మురుగు కాలువ నందు ఉపాధి హామీ కూలీల ద్వారా జరుగుచున్న కిక్కిస తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ రిజిస్టర్ను పరిశీలించి ఎంతమంది హాజరయ్యారు, ఎన్ని రోజులు పని కల్పించారు, ఎన్ని గంటలకి పనికి హాజరవుతున్నారు, తదితర వివరాలను తెలుసుకొని హాజరను స్వయంగా పిలిచి పనికి వచ్చిన వారి హాజరుని నిర్ధారణ చేసుకున్నారు. ఈ సందర్భంలో కొందరు కూలీలు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేవని, వయస్సు కారణంగా వ్యవసాయ పనులు కూడా చేయలేకపోతున్నామని ఉపాధి హామీ పనులు కల్పించడం వలన మాకు పని దొరుకుతుందని చాలా సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ వద్ద ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జాబ్ కార్డ్ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి పని కల్పించడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వారతిప్ప డ్రైన్ కిక్కస తొలగింపు పనుల నిమిత్తం 537 పని దినాలను కల్పించడం జరిగిందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని ప్రదేశాలలో ఓఆర్ఎస్ తోపాటు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. త్రాగునీరు, మజ్జిగ అందించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. పని కోరిన వారికి తప్పకుండా పనిని కల్పించాలని డ్వామా అధికారులను ఆదేశించారు. వారతిప్ప వాడకం నీటి చెరువు నందు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నామని కొంతమంది ఉపాధి హామీ కూలీలు కలెక్టర్ తెలియజేయగా పరిశీలించి వెళ్తానని బదులిచ్చారు.

అనంతరం వారతిప్ప వాడకం నీటి చెరువును స్వయంగా పరిశీలించి ఎంపీడీవోతో మాట్లాడారు. వంతుల వారి విధానం వలన నేటి నుండే నీటిని నింపడం జరుగుచున్నదని, వాడకం నీటికి ఇబ్బంది ఉండదని తెలిపారు.
ఈ సందర్భంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డా.కేసిహెచ్ అప్పారావు, మొగల్తూరు తహాసిల్దార్ కె.రాజ్ కిషోర్, ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి, డ్వామా అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఈనెల 5న తిరుమల విద్యాసంస్థలో అవగాహన సదస్సు

భీమవరం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భీమవరం తిరుమల విద్యాసంస్థలో ఈనెల 5న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. 5,6,7,8,9, 10వ తరగతులు పూర్తిచేసిన విద్యార్థులకు, జెఈఈ (మెయిన్స్ , అడ్వాన్సుడ్ ), నీట్ పై ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. తమ పిల్లలు భవిష్యత్తులో ఐఐటి, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

### కూటమి ప్రభుత్వంలో ప్రజలకు

## సౌకర్యవంతమైన రహదారులు

**రూ.63 లక్షలతో సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**



భీమవరం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పిస్తున్నామని, ప్రజలు తమపై ఉంచుకున్న నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలో పలు గ్రామాల్లో రూ 63 లక్షలతో సిసి రోడ్లను గురువారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. వీరవాసరం మండలం దూసనపూడి గ్రామంలో రూ 14 లక్షలతో 173 మీటర్ల సిసి రోడ్డు, రూ 8 లక్షలతో 107 మీటర్ల సిసి రోడ్డు, రూ 5 లక్షలతో 58 మీటర్ల సిసి రోడ్డు, రూ 6 లక్షలతో 53 మీటర్ల సిసి రోడ్డు, మత్స్యపురి పాలెం గ్రామంలో రూ 20 లక్షలతో 730 మీటర్ల సిసి రోడ్డు, రూ 10 లక్షలతో మత్స్యపురి పాలెం నుంచి తుందుర్రు సిసి రోడ్డును ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నామని, గత ఐదేళ్లలో రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను నేడు ఎంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అన్ని గ్రామాల్లోను పట్టణంలోను సిసి రోడ్లను వేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్ లు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల్లో వీసీ ఆకస్మిక తనిఖీలు

భీమవరం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ కాకినాడ జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కాకినాడలోని వి.ఎస్.ఎల్. మహిళా డిగ్రీ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాల లోని పరీక్ష కేంద్రాలను వీసీ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో నియమ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల్లలో డిగ్రీ 4,6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 109 కేంద్రాల్లో సుమారు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని తెలిపారు. అలాగే బీఈడీ బీపీఈడీ డీపీఈడీ 1 సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో రెండు వేల ఐదు వందల మంది, లా 8,10 సెమిస్టర్ పరీక్షలకు 3 కేంద్రాల్లో ఐదు వందల మంది పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను కళాశాలల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలియజేశారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పని చేయాలన్నారు. వేసవి కాలంలో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, కరెంట్ సమస్యలు లేకుండా, శుభ్రమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. పరీక్షా కేంద్రాల్లో నియమ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలని, ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత పరీక్షా కేంద్రం పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

### భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత

## మనమందరిపై ఉంది..

### ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనమందరిపై ఉందని, వృక్షో రక్షతి రక్షిత: అని, చెట్లను మనం కాపాడితే చెట్లే మనల్ని కాపాడుతాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం సంస్కార్ స్కూల్ విద్యార్థులు సేవ్ ట్రీస్ .. సేవ్ ఎర్త్ అనే నినాదంతో గురువారం ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే అంజిబాబుకు మొక్కలను అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ సమస్త ప్రకృతికి ప్రణామం పర్యావరణాన్ని సంరక్షించడం మన కర్తవ్యమని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ప్రకృతిని కాపాడటం అనేది ప్రతిఒక్కరు బాధ్యతగా భావించి ఒక మొక్కనైనా పెంచాలని అన్నారు. అనంతరం విద్యార్థులు “మానవ మనుగడకు మొక్కలు ఎంతో ఉపయోగకరం అనే విషయాన్నీనాటక రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. బ్యాంక్ కాలనీలోని ఇంటింటికి వెళ్లి విద్యార్థులు మొక్కలను అందించారు. కార్యక్రమంలో సంస్కార్ స్కూల్ కరస్పాండెంట్ నందమూరి రాజేష్, డైరెక్టర్ నందమూరి నాగ ప్రశాంతి, ప్రిన్సిపాల్ అడపా సత్యవతి, ఉపాధ్యాయులు ఆర్ హేమలత, బి ప్రేమ్ కుమార్, వి కుమారి తదితరులు పాల్గొన్నారు.

### కేరింతల హోరులో

## కెయూ ఇంజనీరింగ్ విద్యార్థుల ఫేర్వెల్

**కాలేజీ జీవితం మర్చిపోలేని మధురమైన జ్ఞాపకం. కేయూ ఇంజనీరింగ్ ఫేర్వెల్ లో ఉపకులపతి ఆచార్య కూన రాంజీ**



మచిలీపట్నం ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
కృష్ణా విశ్వవిద్యాలయం : కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్న విద్యార్థులకు మూడవ సంవత్సరం విద్యార్థులు ఫేర్వెల్ ఇచ్చారు. సముద్రపు హోరుకు ధీటుగా కేరింతల కొడుతూ ఉత్సాహంగా సందడి చేశారు... ఆటలు, పాటలు, సరదాలు, సెటైర్లతో కూడిన స్కిట్లు వంటి ఊపుతెచ్చే యంగ్ తరంగ్ కార్యక్రమాలతో కుర్రకారు ఆడిటోరియాన్ని ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ మాట్లాడుతూ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఏ కార్యక్రమం అయినా వినూత్నంగా ఒక నూతన వరవడిలో ఉంటుందని తనక్కూడా ఇలాంటి విద్యార్థుల కార్యక్రమాలతో మమేకమవడం ఎంతో ఆహ్లాదాన్నిస్తుందన్నారు. ఇవన్నీ చూస్తుంటే నా ఇంజనీరింగ్ రోజుల గుర్తొస్తున్నాయని చెప్పుకొచ్చారు. క్యాంపస్ లోని ఇంజనీరింగ్ కళాశాల లో రెండు విభాగాలైన సి ఎస్ సీ, ఈసీఈ నుండి దాదాపు 200 మంది విద్యార్థుల్లో సాధ్యమైనంత ఎక్కువమంది త్వరగా ఉద్యోగాలు సాధించి మూడో సంవత్సరం విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని అభిలషించారు. తదుపరి వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం వి బసవేశ్వర రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల దినదిన ప్రవర్ధ మానమై వెలగాలని ఆకాంక్షించారు... ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఇంజనీరింగ్ కాలేజీ డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ విజయ్ కుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో 5,840 మెగావాట్ల సామర్థ్యంతో 8 సూపర్ క్రిటికల్ యూనిట్లు.

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం.

ఏలూరు ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
విద్యుత్ ఉత్పత్తి అనధికారిత కార్యకలాపం కాబట్టి విద్యుత్ కేంద్రాల ప్రమోటర్లు తగిన సాంకేతికతలను స్వతంత్రంగా ఎంపిక చేసుకోవచ్చని అయితే మినిస్ట్రీ ఆఫ్ పవర్ పాత సబ్-క్రిటికల్ యూనిట్లకు బదులుగా అధిక సామర్థ్యం గల సూపర్ క్రిటికల్, అల్ట్రా సూపర్ క్రిటికల్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ తెలిపారు. 2025 మార్చి 28 నాటికి భారతదేశంలో 98 సూపర్ క్రిటికల్ యూనిట్లు (68,070 మెగావాట్లు) మరియు 8 అల్ట్రా సూపర్ క్రిటికల్ యూనిట్లు (5,560 మెగావాట్లు) ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో 5,840 మెగా సామర్థ్యంతో 8 సూపర్ క్రిటికల్ యూనిట్లు ఉన్నాయని కేంద్రమంత్రి బదులిచ్చారు. గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో థర్మల్ పవర్ ప్లాంట్ల ఇంధన సామర్థ్యాన్ని, ఉత్పత్తిని పెంచడానికి తీసుకున్న చర్యలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ గురువారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర విద్యుత్ అథారిటీ నివేదిక ప్రకారం 2022-23లో దేశవ్యాప్తంగా బొగ్గు మరియు లిగ్నైట్ ఆధారిత విద్యుత్ కేంద్రాల థర్మల్ సామర్థ్యం 35.02 శాతంగా నమోదైందని, 2018-19లో 35.62 శాతం, 2019-20లో 35.69 శాతం, 2020-2021లో 35.88 శాతం, 2021-22లో 35.11 శాతంగా ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు పీఏటీ పథకం అమలు చేయబడిందని, ఈ పథకం మూడు సంవత్సరాల వ్యవధిలో ఉత్పత్తి నిష్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించబడిందని, దేశవ్యాప్తంగా 184 గిగావాట్లు సామర్థ్యాన్ని కవర్ చేస్తుందని, ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 11.2 గిగావాట్లు ఉన్నాయని, ఈ కార్యక్రమం ద్వారా 7.73 మిలియన్ టన్నుల ఆయిల్ సమానమైన ఇంధన పొదుపు సాధించబడిందని, ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 0.146 మిలియన్ టన్నులు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# దశాబ్దాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

**రూ.కోటి 25 లక్షల పేపరు మిల్లు సీఎస్ఆర్ నిధులతో పనులకు శ్రీకారం**

**మే30 నాటికి పంపు హౌస్... పైపు లైన్ పనులు పూర్తి**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**




రాజమహేంద్రవరం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక 41వ వార్డు పరిధిలోని కోటిలింగాల పేటలో దశాబ్దాల నాటి ముంపు సమస్యకు పేపరుమిల్లు సహకారంతో శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) చెప్పారు. పేపరుమిల్లు సీఎస్ఆర్ ఫండ్స్ రూ.కోటి 25 లక్షలతో నిర్మిస్తున్న పంపు హౌస్, పైపు లైన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 41వ డివిజన్ ఇంచార్జ్ నందివాడ దినేష్ పర్యవేక్షణలో నగర బీసీ సెల్ అధ్యక్షులు బుడ్డిగ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దశాబ్ద కాలానికి పైగా ఉన్న ముంపు సమస్య నుండి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో ఈ పనులు మే 30వ తేదీ నాటికి పూర్తి అవుతాయని చెప్పారు. ఎన్నో ఏళ్ళుగా కోటిలింగాల పేట ప్రజలు వర్షాకాలంలో ముంపు బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో వర్షం ముంపు సమయంలో ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోతే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పత్తాలేకుండా పోయేవారని ఆ సమయంలో తాను మోకాలిలోతు నీటిలో ఇంటింటికీ తిరిగి స్థానిక ప్రజలకు పాల ప్యాకెట్లు, తాగునీరు అందించానని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేగా ఈ ప్రాంతంలో ముంపు నివారణకు పేపరు మిల్లు సహకారంతో రూ. కోటి 25 లక్షల సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. వర్షం కురిసిన వెంటనే ఆ నీటిని పైపు లైన్ ద్వారా మళ్ళిస్తారని దాంతో ఇక్కడ ముంపు సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు మేలు చేసే పనులు చేయకుండా వారి జేబులు నింపుకునేందుకు పేపరుమిల్లు నుంచి డబ్బు సంచులు పట్టుకుపోయారని ఆరోపించారు. మరో రూ.8 లక్షలతో 45వ వార్డు పరిధిలోని ఆనందనగర్ మున్సిపల్ స్కూలులో డిజిటల్ లైబ్రరీ కల్పిస్తున్నామని, మొత్తం రూ. కోటి 30 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పేపర్ మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్ జైన్, టీడీపీ నాయకులు కొయ్యల రమణ, ఆడారి లక్ష్మీ నారాయణ, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణం అదనపు ఆర్థిక సహాయం కోసం అందుబాటులో ఆప్షన్ : కలెక్టరు ప్రశాంతి




రాజమహేంద్రవరం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇండ్ల నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం విడుదల చేసిన లబ్దిదారులచే మే నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా పర్యవేక్షణ బాధ్యత అధికారులు, సిబ్బంది వహించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల, డివిజన్, నియోజక వర్గాల అధికారులు, ప్రత్యేక అధికారులతో హౌసింగ్ ఇన్చార్జి పిడి ఎస్ భాస్కర్ రెడ్డితో కలిసి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మే 31 నాటికి జిల్లాలో 10,794 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి, ప్రారంభించేలా తూర్పు గోదావరి జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు 4,929 (46%) లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. ఇంకా 5,865 ఇళ్లను పూర్తి చెయ్యాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరికం లేని సమాజ స్థాపన ధ్యేయంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు తెలిపారు. స్వంత ఇంటి నిర్మాణం ద్వారా 50 శాతం పేదరికం జయించినట్లే అని పేర్కొన్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసే ఉద్దేశ్యంతో ఇంటి నిర్మాణం కోసం ముందుకు వచ్చిన లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ, బీసీలకు అదనపు ఆర్థిక సహాయం విడుదల చేయడం జరిగిందన్నారు. అదే విషయంపై క్షేత్ర స్థాయిలో లబ్దిదారులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మార్చి 31 వరకు ఇచ్చిన గడువు ముగిసిన, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముందుకు రావడం తో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అదనపు ఆర్థిక సహాయం విడుదల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్సైట్ లో అవకాశం ఉందని కలెక్టర్ తెలియ చేశారు. అదనపు ఆర్థిక సహాయం దరఖాస్తు చేసుకునే వెసులుబాటుపై మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం కోసం 5330 మంది లబ్దిదారులు అంగీకారం తెలియ చెయ్యగా, వారిలో 3378 మందికి రూ.7 కోట్ల 64 లక్షలు విడుదల చెయ్యడం జరిగిందన్నారు. గృహ నిర్మాణం కోసం ఆసక్తి చూపిన వారికి నిధులు విడుదల చెయ్యడం జరిగిందని, వాటిని ఇంటి నిర్మాణం కోసం మాత్రమే ఉపయోగించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇకపై వారం వారం సహాయ ఇంజనీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనితీరుపై సమీక్ష చేస్తామని, అదనపు ఆర్థిక సహాయం దుర్వినియోగం కాకుండా సక్రమ వినియోగం పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా ఆధ్వర్యంలో ఇతర లబ్దిదారులకు అదనపు ఆర్థిక సహాయం కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం కోసం ఆప్షన్ విషయమై మరోసారి క్షేత్ర స్థాయిలో ఆమేరకు గృహ లబ్దిదారులకు అవగాహన కల్పించాలని ఇంచార్జ్ హౌసింగ్ పిడి ఎస్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మరోసారి ఇంటి నిర్మాణం కోసం ఆసక్తి కలిగిన లబ్దిదారులు స్టేజ్ కన్వర్షన్ విధానంలో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని తెలియ చేశారు. మే 31 నాటికి ఇంకా పూర్తి చెయ్యవలసిన 5,865 ఇండ్ల స్టేజి కన్వర్షన్ పై రోజు వారి ప్రగతి సాధించడం పై దృష్టి పెట్టాలని కోరారు. ఇంటి నిర్మాణం స్టేజి కన్వర్షన్ ఆధారంగా హౌసింగ్ అధికారులు జీతాలు చెల్లింపు జరపాలని కలెక్టర్ స్పష్టం చేసినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పిడి హౌసింగ్ ఎస్. భాస్కర్ రెడ్డి , డిఆర్డిఏ పిడి ఎన్వివిఎస్ మూర్తి, హౌసింగ్ ఐ టి పర్సన్ టి. విద్యా సాగర్ లు పాల్గొన్నారు

# రెడ్ బుక్ పేరు వినగానే.. ఒకరికి గుండెపోటు..

**మరొకరికి బాత్రూమ్ లో పడి చేయి విరిగింది - -చట్టాలను ఉల్లంఘించిన వారికే రెడ్ బుక్**

**-రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్**

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

"రెడ్ బుక్ పేరు చెప్పగానే వైసిపి నాయకులు బెంబేలెత్తుతున్నారు, ఇప్పటికే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరు బాత్రూమ్ లో పడి చేయి విరిగింది. చట్టాలు ఉల్లంఘించిన వారికే రెడ్ బుక్ వర్తిస్తుంది" అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో గురువారం నిరుపేద కుటుంబానికి శాశ్వత పట్టా అందించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "గత ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసింది. మేము అంబేద్కర్ గారి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాం. మేము ప్రతిపక్షనేత ఇంటిగేటుకు తాళ్లు కట్టలేదు, తప్పుడు కేసులు బనాయించడం లేదు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కంటే ఎక్కువగా జగన్ కు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ఆయన స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం కల్పిస్తున్నాం. వారు తప్పుడు ప్రచారం చేస్తే ఎలా తిప్పికొట్టాలో మాకు తెలుసు" అన్నారు."కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 35 వేల మంది ప్రజలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు పొట్టచేతబట్టుకొని వలసలు వెళ్లారు. యువగళం పాదయాత్ర సమయంలో అక్కడ వలసలను నివారిస్తానని హామీ ఇచ్చా. ఆ మాటమేరకు కనిగిరిలో తొలి రిలయన్స్ సిబిజి ప్లాంటు ఏర్పాటుచేశాం. అక్కడ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వేల ఎకరాల భూములు ఇచ్చేందుకు తమ రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దానిపై రిలయన్స్ డైరక్టర్ స్పందించి 50ప్లాంట్లు అక్కడే ఏర్పాటుచేస్తామని అన్నారు. కరువు ప్రాంతంలో పెద్దఎత్తున యువతకు ఉపాధి కల్పించేందుకు ఇటువంటి ప్రాజెక్టులు తెస్తుంటే వైసిపి వారికి కడుపుమంట దేనికి? బొబ్బలు వస్తాయంటూ దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ దుష్ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే అటువంటి వారిని రెడ్ బుక్ లోకి ఎక్కిస్తానని చెప్పా" అని లోకేష్ గుర్తు చేశారు.

"సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయలేని వారు మాకు చెబుతారా? ప్రిజనరీ ఆలోచనలన్నీ జైలువైపే ఉంటాయి. తప్పుచేశారు కనుక ఆయన ధైర్యంగా ప్రజల్లో తిరగలేకపోతున్నాడు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎవరినీ కలవలేదు, ప్రతిపక్షంలోకి వెళ్ళిన తరువాత కూడా కనీసం కార్యకర్తలను కలిసే సమయం%రి% జగన్ కు లేదు. ప్రజలను కలిసే ఓపిక ఆయనకు ఎక్కుడుంది? ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అయిదేళ్లు ఆయన నివసించే ప్రాంతంలో ప్రజల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదు? పైగా ఆయన ఇంటిదారి కోసం పేదోళ్ల ఇళ్లను కూల్చారు. పేదలకు అండగా నిలిచే ప్రజాప్రభుత్వం మాది. మాతో అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడలేక కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మా ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోంది. తప్పుచేసిన వారు ఎవరైనా వదిలే ప్రసక్తిలేదు" అని హెచ్చరించారు.

"విజనరీ లీడర్ కు %-% ప్రిజనరీకి ఎంతో తేడా ఉంది. ప్రపంచంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా మనబిడ్డలను సిద్ధం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. 1994లో చంద్రబాబు తొలిసారి సిఎం అయినప్పుడు కొందరు ప్రత్యర్థులు కంప్యూటర్లు అన్నం పెడతాయా అంటూ అవహేళన చేశారు. ఇప్పుడు హైదరాబాద్ లో ఐటి ఎన్నిలక్షలమంది యువత ఉద్యోగాలు




చేస్తున్నారో కళ్లముందు కన్పిస్తోంది. చంద్రబాబునాయుడు ఎంతో ముందుచూపుతో ఆలోచించి ఐటి టవర్, ఐఎస్ బి, జీనోమ్ వ్యాలీ, అవుటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్పోర్ట్ వంటివాటిని అభివృద్ధి చేశారు. ఫలితంగా ఈరోజు హైదరాబాద్ అంతర్జాతీయస్థాయి నగరంగా తయారైంది. విభజిత ఆంధ్రప్రదేశ్ ను అదేస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారు. నిరుపేదలను పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు తేవాలన్న లక్ష్యంతో పి4 విధానానికి రూపకల్పన చేసి, ఇటీవల ప్రారంభించారు.

రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. వరికి సంబంధించి గత ప్రభుత్వ బకాయిలను చెల్లించడమేగాక కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్న ధాన్యానికి ఎప్పటికప్పుడే డబ్బు రైతుల ఖాతాల్లో జమచేస్తున్నాం. తక్కువ ధర పలికే కొన్నిరకాల మిర్చి కనీస మద్దతుధర రూ.11,500 అందజేస్తున్నాం. పసుపు ధరలకు సంబంధించి నేను దృష్టిసారించా. గిట్టుబాటు ధరలపై అచ్చంనాయుడు, నాదెండ్ల మనోహర్ లతో కూడిన కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. రైతు నష్టపోకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిది. కొన్నిరకాల పంటల ఎక్కువగా వచ్చినపుడు మార్కెట్ ఇంటర్వెన్షన్ తో ధరలను స్థిరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి లోకేష్ చెప్పారు.

## 5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో ఈనెల 5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాజమండ్రి చార్టర్ ఛైర్మన్, రొటేరియన్ తీగల రాజా, ఐకాన్ అధ్యక్షుడు రొటేరియన్ వెంకట్ చెప్పారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాదిలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ కుస్తీ పోటీలను తమ క్లబ్ తరుపున రాజమండ్రిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కుస్తీ పోటీల విజేతలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఇప్పుడు ఈ కుస్తీ పోటీలను దక్షిణాదిలో కూడా పరిచయం చేయాలని



ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా రాజమండ్రిలో నిర్వహిస్తున్నామని తీగల రాజా చెప్పారు. అండర్-15 బాలురు, బాలికలకు, అండర్-20 పురుషులు, మహిళలకు రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్ పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. సుమారు 300 మంది రెజ్లర్స్ హాజరవుతారని చెప్పారు. ఈ పోటీల విజేతలు రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధిస్తారని తీగల రాజా, వెంకట్ చెప్పారు. కుస్తీ పోటీల్లో పాల్గొనే రెజ్లర్స్‌కు ఐఐటి, ఎన్ఐటిల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. స్పోర్ట్సు ఛైర్మన్ రొటేరియన్ మద్దూరి శంకర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు దివాన్ చెరువు ఎస్వీబీసీ కల్యాణ మండపంలో జరుగుతాయని, 5వ తేదీ ఉదయం ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ కుస్తీ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 6వ తేదీ మధ్యాహ్నం ముగింపు కార్యక్రమం జరుగుతుందని శంకర్ చెప్పారు. రెజ్లర్లకు ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో క్లబ్ కార్యదర్శి రొటేరియన్ ఉదయగిరి సురేష్, కోశాధికారి రొటేరియన్ కామేశ్వరిదేవి, స్పోర్ట్స్ డైరెక్టర్ పిహెచ్ఎస్ కార్తీక్, సంయుక్త కార్యదర్శి రొటేరియన్ వంశీ, స్పోర్ట్స్ డైరెక్టర్ ఎస్ ఫణీంద్ర, రొటేరియన్ శ్యామ్ పొన్నాడ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి గోవిందుకు బట్టలు పెట్టి మరీ పట్టా అందించిన లోకేష్

**-ఆనందంతో పొంగిపోయిన గోవిందు కుటుంబం**

**-మరో 30ఏళ్లు మీరే ఎమ్మెల్యేగా ఉండాలని లోకేష్ కు ఆశీర్వచనం**

**-ఆప్యాయతతో మంత్రి లోకేష్ కు పాయసాన్ని తినిపించిన కుటుంబసభ్యులు**



మంగళగిరి, ఏప్రిల్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉండవల్లి రజకుల కాలనీలోని కొండవాలు ప్రాంతంలో రాజమండ్రి గోవిందు కుటుంబం గత పదిహేనేళ్లుగా ఇల్లు నిర్మించుకొని జీవనం సాగిస్తోంది. అది కొండ పోరంబోకు కావడంతో ఇప్పటివరకు ఆ ఇంటిపై వారికి ఎటువంటి అధికారిక హక్కులు లేవు. మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గురువారం గోవిందు ఇంటికి వెళ్లి బట్టలు పెట్టి మరీ శాశ్వత ఇంటి పట్టాను అందజేశారు. దీంతో గోవిందు కుటుంబం ఆనందంతో పొంగిపోయింది. మరో 30ఏళ్లు మంగళగిరికి మీరే ఎమ్మెల్యేగా ఉండాలయ్యా అని గోవిందు కుటుంబసభ్యులు లోకేష్ కు దీవెనలు అందించింది. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో మంత్రి లోకేష్ గోవిందు ఇంటికి చేరుకున్నారు. గోవిందు కుటుంబం లోకేష్ ను సాదరంగా తమ ఇంటిలోకి ఆహ్వానించింది. వారి కుటుంబ యోగక్షేమాలను తెలుసుకున్నారు. తాము దుగ్గిరాల నుంచి ఇక్కడకు వచ్చి 2008లో ఇల్లు నిర్మించుకున్నామని గోవిందు, ఆయన భార్య సీతామహాలక్ష్మి తెలిపారు. ఇల్లు నిర్మించుకున్న తర్వాత పట్టా కోసం గత పదిహేనేళ్లుగా తమ సంఘ పెద్దలతోపాటు తాము ఎన్నోసార్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. మీరు మాకు చేసిన సాయం జీవితంలో మరువలేమన్నారు. దీనికి మంత్రి



లోకేష్ స్పందిస్తూ... నాపై ఎంతో నమ్మకంతో 91వేల మెజారిటీతో నన్ను మీరు గెలిపించారు, ఇంత భారీ మెజారిటీ ఇస్తారని నేను కూడా ఊహించలేదు. మీ కల నెరవేర్చడం మంగళగిరి ఎమ్మెల్యేగా నా బాధ్యత. ఇప్పుడు మంగళగిరి నియోజకవర్గంలో ఉన్నవాళ్లంతా నావాళ్లే. కూలీనాలి చేసి మీరు అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. మీ పట్టాల కోసం నేను కేబినెట్ వరకు పోరాడి సాధించాను. దేవుడు కూడా సహకరించాడు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇదే తరహాలో నివసిస్తున్న పేదలకు మంగళగిరిలో మేం చేసిన మోడల్ ఉపయోగపడుతుంది. మేనెల నుంచి నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారిస్తున్నా. పార్కులు, రోడ్లు, చెరువులు, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని చెప్పారు. గోవిందు కుటుంబంతో మాట్లాడిన లోకేష్.. ఉదయం 10.59 గంటల ముహూర్తానికి బట్టలుపెట్టి పట్టాను గోవిందు కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గోవిందు కుటుంబసభ్యులు ఆప్యాయతతో ఇచ్చిన పాయసాన్ని లోకేష్ స్వీకరించి, వారితో ఫోటోలు దిగారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
ఏప్రిల్ 04,
శుక్రవారం 2025


# ఆట పైనే మా దృష్టి.. శబ్దం మీద కాదు

## కోహ్లీకి గిల్ కౌంటర్!

**బెంగళూరును తన సొంత మైదానంలో మట్టికరిపించిన గుజరాత్ పాయింట్ల పట్టికలో టాప్-4లోకి దూసుకొచ్చింది. ఈసందర్భంగా గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. భారత స్టార్ ఆటగాడు, ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీకి కౌంటర్‌గా అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అసలు ఇంతకీ ఏం పోస్టు పెట్టాడంటే?**



చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీపై గుజరాత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ 2025 సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన బెంగళూరుకు సొంత మైదానంలోనే షాక్ తగిలింది. ఇక్కడ ఆడే ప్రతి మ్యాచ్ సమయంలోనూ విరాట్ కోహ్లీ అభిమానులను ఉత్సాహపరుస్తూ ఉంటాడు. అదే సమయంలో గిల్ (%వాష్ట్రబఎమ్ఖఅ +అశ్రీశ్రీ%) వికెట్ పడినప్పుడూ ఆ స్థాయిలోనే సంబరాలు చేసుకున్నాడు. ఆ మ్యాచ్‌లో గుజరాత్ గెలిచాక.. గిల్ సోషల్ మీడియాలో " మేం గేమ్‌పై దృష్టిపెడతాం. శబ్దం మీద కాదు" అని పోస్టు పెట్టాడు. దీనికి అభిమానులు ప్రతిస్పందించారు.

"మ్యాచ్ సమయంలో విరాట్ కోహ్లీ చేసిన దానికి శుభ్‌మన్ గిల్ కౌంటర్ ఇచ్చాడు"

"మాకు తెలుసు. ఎవరి గురించి గిల్ పోస్టు పెట్టాడో అర్థమైంది. అయితే, ఇక్కడ నిన్ను (గిల్) తక్కువ చేసే ఉద్దేశం లేదు కానీ, దేశంలో అత్యంత ఓవర్‌రేటెడ్ ప్లేయర్‌వి నువ్వే" "ఇలాంటి కామెంట్లు చేయడం వల్ల వచ్చిన లాభం ఏంటి? ఎవరైనా నిన్ను హేళన చేశారా? ఏ మ్యాచ్‌లోనైనా సొంత జట్టుకే ఫ్యాన్స్ మద్దతుగా నిలుస్తారు. నిన్ను ఓ బ్యాటర్‌గా అభిమానిస్తా. ఇప్పుడు నీపై ఉన్న గౌరవం పోయింది"

"ఫస్ట్ భారత్ తరఫున టీ20 జట్టులో స్థానం సంపాదించు. ఆ తర్వాత ఇలాంటివి పోస్టు చేయొచ్చు"

# నాకు అలాంటి అవకాశం వచ్చింది

## మౌనం వీడిన యశస్వి జైస్వాల్

**వ్యక్తిగత కారణాలతో దేశవాళీ క్రికెట్‌లో ముంబయి జట్టును యశస్వి జైస్వాల్ వీడిన సంగతి తెలిసిందే. ఒక్కసారిగా అతడు ఈ నిర్ణయం తీసుకోవడంతో క్రికెట్ ప్రపంచం నివ్వెరపోయింది. ముంబయి జట్టులో అదరగొట్టి టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. తాను ముంబయిని వీడటానికి కారణమేంటో యశస్వి వెల్లడించాడు. గోవా నుంచి తనకు మంచి ఆఫర్ వచ్చిందని తెలిపాడు. టీమ్‌ఇండియా మ్యాచులు లేనప్పుడు దేశవాళీలో ఆడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నాడు.**




"ఈ నిర్ణయం తీసుకోవడం చాలా కష్టంగా అనిపించింది. నేను ఇలా ఉండటానికి కారణం ముంబయి. ఈ నగరమే నన్ను ఇలా మార్చింది. నా జీవితాంతం ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు రుణపడి ఉంటా. గోవా నాకు ఓ అద్భుతమైన అవకాశం ఇచ్చింది. నాయకత్వ పాత్ర పోషించాలని అడిగింది. అయితే, ఎప్పటికీ నా తొలి ప్రాధాన్యం టీమ్‌ఇండియాదే. జాతీయ జట్టుకు ఆడనప్పుడు మాత్రం తప్పకుండా గోవాకు ఆడతా. టోర్నీ ఆసాంతం ఆడేందుకు ప్రయత్నిస్తా. నాకు వచ్చిన ఛాన్స్‌ను అందిపుచ్చుకోవడానికి ఎప్పుడూ ముందుంటా" అని జైస్వాల్ వెల్లడించాడు.

### అవన్నీ రూమర్లే: సూర్యకుమార్

యశస్వి జైస్వాల్ బాటలోనే సూర్యకుమార్ యాదవ్ కూడా బయటకొస్తాడని కథనాలు వచ్చాయి. అయితే, వాటిపై సూర్య స్పందించాడు. "ఈ కథనాలను సిద్ధం చేసిన వ్యక్తి స్క్రిప్ట్ రైటరా? లేదా జర్నలిస్టా? అలాగైతే ఇక నుంచి నేను కామెడీ సినిమాలను చూడటం మానేసి ఈ ఆర్టికల్స్‌ను చదవడం ప్రారంభిస్తా. ఇవన్నీ అర్థరహితమైన కథనాలు" అని సూర్య పోస్టు పెట్టాడు. భారత క్రికెటర్లు దేశవాళీలో ఆడటాన్ని బీసీసీఐ తప్పనిసరి చేయడంతో ఈ ఏడాది జనవరి 23-25 వరకు జమ్మూకశ్మీర్‌తో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి తరఫున యశస్వి చివరిసారిగా బరిలో దిగాడు. ఈ మ్యాచ్‌లో ముంబయి ఓడిపోగా.. యశస్వి వరుసగా 4, 26 పరుగులు సాధించాడు. "యశస్వి గోవాకు ఆడాలని అనుకుంటున్నాడు. అతడిని మేం స్వాగతిస్తున్నాం. వచ్చే సీజన్ నుంచి అతను గోవాకు ఆడతాడు. భారత జట్టు విధులు లేనప్పుడు గోవాకు యశస్వి సారథ్యం వహించొచ్చు" అని గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి శంబా దేశాయ్ పేర్కొన్నాడు. 2022-23 సీజన్‌కు ముందు అర్జున్ తెందుల్కర్, సిద్ధేష్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవా జట్టులో చేరారు.

# ఇక్కడే ఏడేళ్లు ఆడా.. ఆర్సీబీతో మ్యాచ్‌పై సిరాజ్ ఎమోషనల్

**గత సీజన్ వరకూ ఆ జట్టుతోనే కలిసి ఆడాడు. ఈ మైదానంలోనే ప్రాక్టీస్‌తో పాటు వికెట్లను తీశాడు. ఇప్పుడు ప్రత్యర్థిగా బరిలోకి దిగాడు. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఆ ప్లేయర్ మహ్మద్ సిరాజ్. ఇప్పుడు అతడు గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా చిన్నస్వామి స్టేడియం వేదికగానే బెంగళూరుతో గుజరాత్ తలపడింది. ఈ మ్యాచ్‌లో జీటీ విజయం సాధించింది. సిరాజ్ 4 ఓవర్ల కోటాలో 3 వికెట్లు తీసి సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొన్నాడు. ఈసందర్భంగా కాస్త భావోద్వేగానికి గురయ్యాడు.**



### ఇంటికి రాగానే చతికిల..

"నేను ఇక్కడ ఏడేళ్లు ఆడా. నా జెర్సీ రెడ్ నుంచి బ్లూకి మారిపోయింది. ఇక్కడికి వచ్చాక కాస్త భావోద్వేగానికి గురయ్యా. కానీ, బంతి అందుకొన్నాక మాత్రం ఇవేవీ ఆలోచించను. నేను రొనాల్డో అభిమానిని. అందుకే, వికెట్ వచ్చిన సమయంలో నా సంబరాలు అలా చేసుకుంటున్నా. అంతర్జాతీయ క్రికెట్‌కు విరామం వచ్చినప్పుడు నా తప్పులు ఏంటో తెలుసుకున్నా. ఫిట్‌నెస్‌పై వర్కౌట్ చేశా. గుజరాత్ టైటాన్స్ నన్ను తీసుకున్నప్పుడు ఆశిశ్‌తో మాట్లాడా. బౌలింగ్‌ను ఆస్వాదించమని సూచించాడు. ఇక సీనియర్ ఇషాంత్ శర్మ లైన్ అండ్ లెంగ్త్ గురించి చెప్పాడు. నేను పిచ్ గురించి పెద్దగా పట్టించుకోను. సానుకూల దృక్పథంతో ముందుకుసాగుతున్నా" అని సిరాజ్ వెల్లడించాడు.

### పిచ్ ఒక్కోలా స్పందిస్తుంటుంది: గిల్

"ఈ మైదానంలో ఆర్సీబీని 170 పరుగుల్లోపే కట్టడి చేయడం బాగుంది. పిచ్ కూడా ఒక్కోసారి ఒక్కోలా స్పందిస్తుంటుంది. 250ం స్కోరును కూడా చేసే అవకాశం లేకపోలేదు. అయితే, త్వరగా వికెట్లు తీస్తేనే ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు వీలు కలుగుతుంది. తొలి 8 ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు మంచి ఆరంభం దక్కింది. త్వరగా ఆర్సీబీ వికెట్లు తీస్తేనే మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు అవకాశం దొరుకుతుందని భావించాం. అలాగే మా బౌలర్లు శ్రమించారు. పిచ్‌ను బట్టి మా బ్యాటింగ్‌లో మార్పులు చేసుకున్నాం" అని గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యానించాడు.

### కనీసం 190 వరకైనా చేయాలనుకున్నాం: రజత్

"మేం ఇక్కడ 200 స్కోరుపై దృష్టిపెట్టలేదు. కనీసం 190 పరుగులకు తగ్గకుండా గుజరాత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించాలని అనుకున్నాం. త్వరగా వికెట్లను కోల్పోవడంతో నష్టపోయాం. మేం ఆడాలనుకొనే విధానం సరైందే. కానీ, పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడటంతో స్కోరు బోర్డు నెమ్మదించింది. ఆఖర్లో జితేశ్, లివింగ్‌స్టన్, టిమ్ డేవిడ్ దూకుడుగా ఆడి గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత లక్ష్యం తక్కువైనా మా బౌలర్లు కాపాడేందుకు చాలా కష్టపడ్డారు" అని బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ వెల్లడించాడు.

# సెమీస్‌లో జదుమణి



దిల్లీ: భారత బాక్సర్ జదుమణి మండెంగ్బామ్ (50కేజీ) ప్రపంచకప్ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. 20 ఏళ్ల ఈ జాతీయ ఛాంపియన్ క్వార్టర్‌ఫైనల్ బౌట్లో 3-2తో బ్రిటన్‌కు చెందిన ఎలిస్ ట్రోబిడ్జ్‌పై విజయం సాధించాడు. జదుమణి సెమీస్‌లో అసిల్బెక్ జలిలోవ్ (ఉస్బెకిస్థాన్)తో తలపడతాడు. మరో ముగ్గురు భారత బాక్సర్లు నరేందర్ బెర్వాల్ ((90ంకేజీ), నిఖిల్ దూబె (75కేజీ), జుగ్నూ (85కేజీ) క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యారు. నరేందర్ 2-3తో సపార్‌బే (ఉజ్బెకిస్థాన్) చేతిలో, నిఖిల్ 0-5తో బెలిని (బ్రెజిల్) చేతిలో ఓడారు. జుగ్నూ 1-4తో అబ్దోలాయె (ఫ్రాన్స్) చేతిలో కంగుతిన్నాడు. ఇంకా మనీష్ రాఠోడ్ (55కేజీ), అభినాష్ (65కేజీ), హితేశ్ (70కేజీ) బరిలోకి దిగాల్సివుంది. ఈ టోర్నీ కోసం భారత్ 10 మందితో కూడిన జట్టును పంపింది. తొలి రోజు లక్ష్య చాహర్ (80కేజీ) తొలి రౌండ్లో ఓడిపోయాడు.

# సొంతగడ్డపై నాలుగు టెస్టులు

## 2025లో టీమ్‌ఇండియా షెడ్యూల్ విడుదల

**దిల్లీ:** ఈ ఏడాది సొంతగడ్డపై క్రికెట్ షెడ్యూలును బీసీసీఐ ప్రకటించింది. 2025లో భారత్ నాలుగు టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. అహ్మదాబాద్, కోల్‌కతా, దిల్లీ, గువాహటి వేదికలు. భారత జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టులు, దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు ఆడుతుంది. టెస్టు వేదికగా గువాహటి అరంగేట్రం చేయనుంది. అక్కడ దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు జరుగుతుంది. దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు కూడా ఆడుతుంది. దక్షిణాఫ్రికా-భారత్ మూడో వన్డేకు డిసెంబరు 6న విశాఖపట్నం ఆతిథ్యమివ్వనుంది.

### భారత్‌లో వెస్టిండీస్ పర్యటన

**తొలి టెస్టు:** అహ్మదాబాద్‌లో అక్టోబరు 6 నుంచి
**రెండో టెస్టు:** కోల్‌కతాలో అక్టోబరు 14 నుంచి

### భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన

**తొలి టెస్టు:** దిల్లీలో నవంబరు 18 నుంచి
**రెండో టెస్టు:** గువాహటిలో నవంబరు 26 నుంచి
**తొలి వన్డే:** రాంచి (నవంబరు 30)
**రెండో వన్డే:** రాయ్‌పూర్ (డిసెంబరు 3)
మూడో వన్డే: విశాఖపట్నం (డిసెంబరు 6)
తొలి టీ20: కటక్ (డిసెంబరు 9)
రెండో టీ20: చండీగఢ్ (డిసెంబరు 11)
మూడో టీ20: ధర్మశాల (డిసెంబరు 14)
నాలుగో టీ20: లఖ్‌నవూ (డిసెంబరు 17)
అయిదో టీ20: అహ్మదాబాద్ (డిసెంబరు 19)

# సన్‌రైజర్స్‌తో కేకేఆర్ పోరు.. ఆ రెండింటి పైనే అందరి దృష్టి!



**డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది. ఐపీఎల్ 2025 సీజన్ మొదటి మ్యాచ్‌లోనే ఆర్సీబీ చేతిలో కేకేఆర్ ఓటమి పాలైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఇప్పుడు రెండే అంశాలు అందరి దృష్టిని ఆకర్షించనున్నాయి. అందులో ఒకటి సన్‌రైజర్స్ '300' కొడుతుందా? లేదా?.. ఇక మరొకటి 'పిచ్' ఎలా ఉండబోతోంది?**

సన్‌రైజర్స్ నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ '300' స్కోరు రావాలని అభిమానులు కోరుకోవడం సహజంగా మారింది. కానీ, గత రెండు మ్యాచుల్లో కనీసం 200ం మార్క్‌ను కూడా తాకలేదు. టాప్ ఆర్డర్ దూకుడుగా ఆడితేనే తాము కూడా పరుగులు రాబడతామనే ఉద్దేశం నుంచి మిడిలార్డర్ బయటపడాలి. తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి నుంచి మంచి ఇన్నింగ్స్ బాకీ ఉంది. అభిషేక్ - ట్రావిస్ హెడ్ సమన్వయంతో పరుగులు చేయాలి. వీరిద్దరూ కుదురుకుంటే గత ఐపీఎల్ ఫైనల్ 'ఓటమి'కి ప్రతీకారం తీర్చుకోవడం సన్‌రైజర్స్‌కు పెద్ద కష్టమేం కాదు. 300 పరుగులు చేయకపోయినా.. కనీసం బౌలర్లు కాచుకొనేంత లక్ష్యాన్నైనా ప్రత్యర్థి ఎదుట ఉంచాల్సిన అవసరం ఉందని సగటు అభిమాని అభిప్రాయం. షమీ, కమిన్స్ పేస్ విభాగంలో స్టార్లే. కానీ, గత మూడు మ్యాచుల్లో పెద్దగా ప్రభావం చూపించలేదు. ధారాళంగానే పరుగులు ఇస్తున్నారు. అందుకే, స్కోరు బోర్డుపై భారీగా రన్స్ ఉంటే స్వేచ్ఛగా బౌలింగ్ చేయగలరు. షమీ బౌలింగ్‌పై తమకు నమ్మకం ఉందని ఎస్ఆర్‌హెచ్ కోచ్ రేయాన్ కుక్ వెల్లడించాడు.

### సిరాజ్ 'ఫైర్' కేవలం ఆర్సీబీపైనే కాదు..: సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు

"మహ్మద్ షమీ సూపర్ బౌలర్. ఎన్నోఏళ్లుగా తన సత్తా ఏంటో నిరూపించుకొన్నాడు. తప్పకుండా అతడినుంచి నాణ్యమైన బౌలింగ్ వస్తుందని ఆశిస్తున్నాం. కాస్త లెంగ్త్‌పై దృష్టిపెడితే ఆటోమేటిక్‌గా సెట్ అవుతాడు. యువ స్పిన్నర్ జీషన్ అన్సారి అద్భుతంగా వేస్తున్నాడు. వార్మప్ మ్యాచుల్లోనే అతడి ప్రతిభను గమనించాం. అరంగేట్రంలోనే మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. రాబోయే మ్యాచుల్లోనూ ప్రభావం చూపిస్తాడు" అని వెల్లడించాడు.

### 'పిచ్' ఎలా ఉండేనో..?

కోల్‌కతా శిబిరంలో ఆందోళన కలిగించిన అంశం 'పిచ్'. తొలి మ్యాచ్ తర్వాతనే కెప్టెన్ అజింక్య రహానె క్యూరేటర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. క్యూరేటర్ కూడా అంతే ఘాటుగా ప్రతిస్పందించాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నా.. బ్యాటింగ్ చేయడమూ పెద్ద కష్టం కాబోదనేది విశ్లేషకుల అభిప్రాయం. బెంగళూరుతో మ్యాచ్‌లో కేకేఆర్ స్పిన్నర్లు వరుణ్, సునీల్ నరైన్ ఇబ్బందిపడగా.. ఆర్సీబీ బౌలర్ కృనాల్ పాండ్య మాత్రం అదరగొట్టాడు. ఇప్పుడు ఎలా స్పందిస్తుందో చూడాలి. ఇక్కడ 93 ఐపీఎల్ మ్యాచుల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు 38 మ్యాచుల్లో గెలవగా.. లక్ష్య ఛేదనకు దిగిన టీమ్ 56 మ్యాచుల్లో విజయం సాధించింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# 25న ఎర్రచీర విడుదల

తెలుగులో సరికొత్త కథతో తెరకెక్కిన చిత్రం 'ఎర్రచీర : ది బిగినింగ్' నటకిరీటి రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్ర పోషించారు. సుమన్‌బాబు స్వీయ దర్శకత్వం వహించారు. బేబి ఢమరి సమర్పణలో శ్రీ పద్మాలయ ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. ఈనెల 25న ఈ సినిమా విడుదల చేయటానికి చిత్ర నిర్మాతలు ఏర్పాట్లు చేశారు.



### హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్న

# కుషుబు కూతురు..

### ఈ రేంజ్ లో ఉందేంటి!

తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన కుషబ్బ అందాలకు ఆరోజుల్లో వీరాభిమానులు ఉండేవారు. ముఖ్యంగా తమిళనాడు లో అయితే ఆమెకు దేవాలయాలు కూడా కట్టారు. ఒక హీరోయిన్ కి ఈ స్థాయి మాస్ ఫ్యాన్ ఫాలోయింగ్ గతం లో ఎప్పుడూ చూడలేదని, స్టార్ హీరోలకు కూడా దక్కని ఆ అదృష్టం కుషబ్బ కి దక్కిందని అందరూ అనుకునేవారు. ఇప్పటికీ ఆమెని తమిళ ఆడియన్స్ అదే విధంగా ఆదరిస్తారు. సీనియర్ హీరోయిన్స్ లో ఇప్పటికీ చెరిగిపోని అందంతో కుర్ర హీరోయిన్స్ కి పోటీ ఇవ్వగలం అనిపించే వారిలో ఒకరు 'కుషబ్బ సుందర్'(%ఖబంస్త్రఎశీశీ ాబఅఝుతీ%). ఒకప్పుడు ఈమెకు యూత్ ఆడియన్స్ లో ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన కుషబ్బ అందాలకు ఆరోజుల్లో వీరాభిమానులు ఉండేవారు. ముఖ్యంగా తమిళనాడు లో అయితే ఆమెకు దేవాలయాలు కూడా కట్టారు. ఒక హీరోయిన్ కి ఈ స్థాయి మాస్ ఫ్యాన్ ఫాలోయింగ్ గతం లో ఎప్పుడూ చూడలేదని, స్టార్ హీరోలకు కూడా దక్కని ఆ అదృష్టం కుషబ్బ కి దక్కిందని అందరూ అనుకునేవారు. ఇప్పటికీ ఆమెని తమిళ ఆడియన్స్ అదే విధంగా ఆదరిస్తారు. కేవలం సినిమాల్లో మాత్రమే కాకుండా, రాజకీయాల్లో కూడా ఆమె అడుగుపెట్టి తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేశారు. దంతా పక్కన పెడితే ఈమె ప్రముఖ తమిళ దర్శకుడు సుందర్ ని ప్రేమించి పెళ్లాడిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ దంపతులిద్దరికీ అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇందులో అవంతిక సోషల్ మీడియా లో నిత్యం యాక్టీవ్ గా ఉంటుంది. ఈమె అచ్చు గుద్దినట్టు తన తల్లి కుషబ్బ పోలికలతో ఉంటుంది. కుషబ్బ యుక్త వయస్సులో ఎంత అందంగా ఉండేదో నేటి తరం ఆడియన్స్ చూసి ఉండకపోవచ్చు. కానీ అవంతిక ని చూసి ఆరోజుల్లో కుషబ్బ ఇలాగే ఉండేది అని అనుకోవచ్చు. ప్రస్తుతం ఇండస్ట్రీ లోకి అడుగుపెడుతున్న ఎంతో మంది యంగ్ హీరోయిన్స్ తో పోలిస్తే అవంతిక లక్ష రెట్లు బెటర్ గా ఉంటుంది. కచ్చితంగా ఈమె సినీ ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టాల్సిందే అని ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్స్ క్రింద నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మోడల్ దుస్తుల్లో ఎంతో స్టైలిష్ గా కనిపిస్తున్న ఆమె లుక్స్ ని చూసి, మీరు కూడా మీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయండి. ఇకపోతే కుషబ్బ ఇప్పటికీ సినిమాల్లో క్యారక్టర్ ఆర్టిస్టుగా తన కెరీర్ ని కొనసాగిస్తూనే ఉంది, అదే విధంగా ఆమె భర్త సుందర్ కూడా దర్శకుడిగా కొనసాగుతూనే ఉన్నాడు. ఈమధ్య కాలంలో ఆయన పలు సూపర్ హిట్ సినిమాలు కూడా చేశాడు. కుషబ్బ ప్రతీ శనివారం, ఆదివారం రోజుల్లో ప్రసారమయ్యే జబర్దస్త్ కామెడీ షోకి న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. కేవలం ఈ ఒక్క షోలో మాత్రమే కాదు, తమిళం లో కూడా ఆమె అనేక షోస్ లో న్యాయ నిర్ణేతగా పాల్గొంటూ ఉంటుంది. కేవలం సినిమాలు, షోస్ మాత్రమే కాకుండా, తమిళం లో పలు టీవీ సీరియల్స్ ద్వారా కూడా ఆడియన్స్ ని అలరిస్తూ ముందుకెళ్తున్న కుషబ్బ రాబోయే రోజుల్లో కెరీర్ పరంగా ఇంకెంత బిజీ గా మారనుందో చూడాలి.

# 'జాక్' ట్రైలర్ విడుదల



సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న సినిమా 'జాక్'. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఎస్వీసీసీ బ్యానర్‌పై నిర్మించారు. ఇందులో వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. వివిధ గెటప్ లలో సిద్దు తనదైన శైలిలో ఆకట్టుకున్నాడు. ఒక ప్రభుత్వ ఆపరేషన్ కు సహకరించే వ్యక్తిగా సినిమాలో నటిస్తున్నారు. కొన్ని కామెడీ డైలాగ్స్ తో ట్రైలర్ అలరించింది. ట్రైలర్ కావడంతో కొన్ని వాడుక భాషా పదాలు సెన్సార్ కాకుండా వచ్చేశాయి. అయితే సినిమా టైటిల్ 'జాక్' పాత్ర ఎవరు అనేది ఇక్కడ సస్పెన్ గా మారింది. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.

## ఆదిత్య 369 సీక్వెల్‌లో

# మోక్షజ్ఞ ఎంట్రీ



సీనియర్ నటుడు బాలకృష్ణ నట వారసుడు నందమూరి మోక్షజ్ఞ సినీ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. 'ఆదిత్య 369' సినిమా సీక్వెల్స్‌లో ఆయన కథానాయకుడిగా నటించ బోతున్నారనేది స్పష్టమైంది. ఈ విషయాన్ని ఆ సినిమా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు స్వయంగా ప్రకటించారు. తన కుమారుడితో సీక్వెల్ చేయాలని బాలకృష్ణ కోరగా ఆయన దానికి అంగీకరించినట్లుగా చెప్పారు. 34 ఏళ్ల క్రితం విడుదలైన 'ఆదిత్య 369' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా రీ రిలీజ్ శుక్రవారంనాడు జరగనుంది. తాజాపర్చిన ప్రింట్‌తో ఈ సినిమా సరికొత్తగా అలరించనుంది. బాలకృష్ణ, మోహిని జంటగా సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. హెచ్‌జి వెల్స్ రచించిన 'ది టైమ్ మిషన్' నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా సింగీతం శ్రీనివాసరావు తెలిపారు.



### మనసు దోచేస్తున్న

## 'హార్ట్ అటాక్' బ్యూటీ !

### ఆదా శర్మ

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339